




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 12 సంచిక : 143 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | బుధవారం 28 జనవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :143 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | WED 28 JANUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# పనితీరు బాగోకపోతే పదవులు ఊడతాయి

## నేతలకు చంద్రబాబు వార్నింగ్



- పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదు.. నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదన్న చంద్రబాబు
- పదవులు పొందిన నేతల పనితీరుపై ప్రతి 3 నెలలకోసారి సమీక్ష
- జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని దిశానిర్దేశం
- అధికారాన్ని నిలబెట్టుకోవడం అందరి బాధ్యత అని నేతలకు సూచన
- గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తీవ్ర విమర్శలు

**పెన్ పవర్ డెస్క్:**పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదని, ఏ నాయకుడైనా సరే నిర్లక్ష్యం వహించినా, వివాదాలు సృష్టించినా పక్కనబెట్టడానికి వెనుకాడబోనని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న భావనతో ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు."పార్టీలో పదవులు పొందిన వారి పనితీరును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తాను. సరిగా పనిచేయకపోతే వారిని తప్పించి, మరొకరికి అవకాశం కల్పిస్తాను. పార్టీలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా నేతలు, కార్యకర్తల్లో కూడా మార్పు రావాలి. వచ్చిన అధికారాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని చంద్రబాబు స్పష్టం చేశారు. పొలిటికల్ గవర్నెన్స్‌లో పార్లమెంట్ కమిటీలు కీలకమని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కూడా పార్లమెంట్ అధ్యక్షులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో కలిసికట్టుగా పనిచేయాలని, 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే మరో పది ఓట్లు అదనంగా వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు

- మిగతా 2లో...



## టీడీపీ వర్క్‌షాప్... కార్యకర్తల మధ్యలో కూర్చున్న చంద్రబాబు

- టీడీపీ పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- నాయకులతో కలిసి కూర్చుని శిక్షణ పొందిన అధినేత
- కార్యకర్తే పార్టీకి అధినేత అని మరోసారి చాటిచెప్పిన వైనం
- పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ పథకాలపై 1050 మందికి శిక్షణ
- చంద్రబాబు నిరాడంబరత స్ఫూర్తిదాయకమన్న నేతలు, కార్యకర్తలు

- మిగతా 2లో...

## ఏపీకి రానున్న రాహుల్ గాంధీ... షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్



- ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమైన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
- ఉపాధి హామీ పరిరక్షణ ఉద్యమంలో పాల్గొనాలని రాహుల్‌కు ఆహ్వానం
- షర్మిల విజ్ఞప్తికి సానుకూల స్పందన... ఏపీకి వస్తానని రాహుల్ హామీ
- వైఎస్సార్ పథకాన్ని ప్రారంభించిన బండ్లపల్లి నుంచే ఉద్యమం ప్రారంభం

- మిగతా 2లో...



## ఢిల్లీలో చారిత్రక ఘట్టం..

### భారత్-ఈయూ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు

- భారత్, యూరప్ సమాఖ్య మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఖరారు
- 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించిన ఈయూ కమిషన్ అధ్యక్షురాలు
- 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత తుది రూపం
- భారత్ నుంచి 97 శాతం ఎగుమతులపై సుంకాల రద్దు
- వచ్చే ఏడాది నుంచి ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం

- మిగతా 2లో...



## మేము సూపర్‌పవర్‌గా మారాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిందే

- అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా భారత్ అభివృద్ధి చెందుతోందని వ్యాఖ్య
- కెనడా సూపర్ పవర్ కావాలంటే భారత్‌తో వ్యాపారం చేయాలన్న మంత్రి టిమ్ హాడ్గ్‌సన్
- ముడిచమురు, సహజ వాయువుల రవాణాకు కెనడా సిద్ధంగా ఉందన్న ఆ దేశ మంత్రి

- మిగతా 2లో...



## ముగిసిన హల్వా వేడుక...

### బడ్జెట్ ప్రవేశపెట్టేవరకు వాళ్లు బయటికి రారు!

- కేంద్ర బడ్జెట్ 2026-27 తయారీలో ముగిసిన హల్వా వేడుక
- ఈ వేడుకతో ప్రారంభమైన బడ్జెట్ అధికారుల 'లాక్-ఇన్' పీరియడ్
- ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- మొబైల్ యాప్‌లోనూ అందుబాటులో ఉండనున్న బడ్జెట్ పత్రాలు
- ప్రసంగం పూర్తయ్యాకే యాప్‌లో బడ్జెట్ వివరాలు వెల్లడి

- మిగతా 2లో...

కేంద్ర బడ్జెట్ 2026-27 రూపకల్పన ప్రక్రియ చివరి అంకానికి చేరుకుంది. ఏటా బడ్జెట్ తయారీలో చివరి ఘట్టానికి సూచనగా నిర్వహించే సంప్రదాయ 'హల్వా వేడుక' మంగళవారం నాడు ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో ఉన్న బడ్జెట్ ప్రెస్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరయ్యారు. బడ్జెట్ రూపకల్పన ప్రక్రియ ముగింపు దశకు వచ్చిందని, ఇక ప్రింటింగ్ ప్రారంభమవుతుందని ఈ వేడుక సంకేతాన్నిస్తుంది. ఈ వేడుక ముగిసిన వెంటనే బడ్జెట్ రూపకల్పనలో పాలుపంచుకున్న కీలక అధికారులు 'లాక్-ఇన్' పీరియడ్‌లోకి వెళతారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెట్టే వరకు వీరంతా బయటి ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా పూర్తి ఏకాంతంగా గడుపుతారు. ఫోన్, ఇంటర్నెట్ వంటి సదుపాయాలకు కూడా దూరంగా ఉంటారు. బడ్జెట్‌కు సంబంధించిన అత్యంత కీలకమైన,

## దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె... స్తంభించిన సేవలు




- వారానికి 5 రోజుల పనిదినాల కోసం దేశవ్యాప్త సమ్మె
- ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్
- యూఎఫ్‌బీయూ పిలుపుతో నిరసన బాట పట్టిన ఉద్యోగులు

- మిగతా 2లో...

## జోగి రమేశ్ ను కలిసిన కేతిరెడ్డి... కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

- ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతున్నందుకు జోగి రమేశ్ ను జైల్లో పెట్టారన్న కేతిరెడ్డి
- ప్రభుత్వ తప్పిదాలపై రమేశ్ పోరాటం చేస్తూనే ఉంటారని వ్యాఖ్య
- తనపై ఉన్న కేసును కొట్టేయించుకోవాలని చంద్రబాబు చూస్తున్నారని విమర్శ



మాజీ మంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రామును తప్పుడు కేసులతో అరెస్ట్ చేశారని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈరోజు ఆయన జోగి రమేశ్ ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తప్పులను ఎత్తిచూపుతున్నందుకు 83 రోజులు జైల్లో పెట్టారని, చంద్రబాబు సర్కార్ వచ్చిన తర్వాత తప్పుడు కేసులు పెట్టి అందరినీ ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు.

- మిగతా 2లో...



## పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు

### టీడీపీ శ్రేణులకు మంత్రి లోకేశ్ దిశానిర్దేశం

- రాష్ట్ర అభివృద్ధికి కనీసం 15 ఏళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండాలని సూచన
- పార్టీ నేతలు అలక వీడి, ఐక్యంగా పనిచేయాలని పిలుపు
- శిక్షణ తరగతుల్లో నిత్య విద్యార్థిలా వెనుక కూర్చుని పాఠాలు విన్న లోకేశ్
- యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు

- మిగతా 2లో...



## పడిపోతున్న డాలర్.. నిలకడగా రూపాయి

- ప్రపంచ మార్కెట్లో బలహీనపడుతున్న అమెరికా డాలర్
- డాలర్‌తో పోలిస్తే రూ.90 వద్ద స్థిరంగా భారత రూపాయి
- భారత్‌లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరిగే అవకాశం
- అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాలతో డాలర్‌పై ఒత్తిడి

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# నిశ్శబ్ద ఆరోగ్య సంక్షోభంలో భారతం

భారత దేశం నిశ్శబ్ద ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. నిశ్చల జీవనశైలి, జన్యుశాస్త్ర కారణాలతో పాటు మనం తీసుకునే ఆహార పదార్థాల వల్ల 'ఇన్సులిన్ నిరోధకత(ఇన్సులిన్ రెసిస్టెన్స్), జీవక్రియ సిండ్రోమ్ (మెటబాలిక్ సిండ్రోమ్) లక్షణాలు కనిపిస్తాయి. మన సాధారణ ఆహారంలో అధికంగా రొట్టెలు, బియ్యపు అన్నం తినడం, బంగాళాదుంపలు తీసుకోవడం, సమోసాలు/బజ్జీలు/బిస్కెట్లు నమలడం, చక్కెరలతో కూడిన శీతల పానీయాలు తాగడం, మైదా పదార్థాలు తీసుకోవడం, బర్గర్ ఫిజ్జాలు ఇష్టపడడం, స్నాక్స్ నమలడం, స్వీట్లు తినడం లాంటివి తీసుకోవడంతో భారతీయులకు జీవక్రియ సంబంధ అనారోగ్యాలు అధికంగా బయట పడుతున్నాయి. దీని ఫలితంగా భారతదేశం "మధుమేహ కేంద్రంగా భారత్" లేదా "డయాబెటిస్ క్యాపిటల్ ఆఫ్ వరల్డ్"గా కీర్తించబడుతున్నది. శరీర కణాలు క్లోమం ఉత్పత్తి చేసే ఇన్సులిన్ హార్మోన్‌కు తక్కువ స్పందన చూపినపుడు ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. కండరాలు, కాలేయం, కొవ్వు లాంటి శరీర కణజాలాలు ఇన్సులిన్‌కు స్పందించనపుడు, రక్తంలో కణాల్లోకి సులభంగా గ్లూకోజ్ చేరడం జరుగదు. దీని వల్ల క్లోమ గ్రంథి (ప్యాంక్రియాస్) అదనంగా ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తూ చివరకు ఆ హార్మోన్ సరిపోక రక్తంలో షుగర్ లెవల్స్ పెరిగి టైప్ – 2 మధుమేహం బయట పడుతుంది. ఇలాంటి అవాంఛనీయ పరిస్థితిని "ఇన్సులిన్ నిరోధకత (ఇన్సులిన్ రెసిస్టెన్స్)" అని, ఇది ఒక ప్రమాదకర జీవక్రియ రుగ్మతగా మారుతుంది. దీనినే "జీవక్రియ ఆరోగ్య సంక్షోభం (మెటబోలిక్ హెల్త్ క్రయసిస్)" అని పిలుస్తున్నాం. ఈ రుగ్మత వల్ల నిద్రలేమి, అలసట, బలహీనత, అధిక దాహం, , ఏకాగ్రత లోపం, దృష్టి కేంద్రీకరించడంలో ఇబ్బందులు, ఆకలి పెరగడం లాంటి లక్షణాలు అధికంగా కనిపిస్తాయి. ఈ విధమైన జీవక్రియ సంక్షోభం ఫలితంగా డయాబెటిస్‌తో పాటు ఊబకాయం (ఒబేసిటీ), గుండె జబ్బులు, స్త్రీలో హార్మోన్ల అసమతుల్యత, కాలేయ వ్యాధి (నాన్–ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్) లాంటి ప్రాణాంతక అనారోగ్యాలు కలుగుతాయి. అధిక బరువు ఉండడం, కాలేయం/బొడ్డు కొవ్వు పెరగడం, శారీరక శ్రమ లేకపోవడం, నిష్క్రియాత్మక జీవన శైలి అలవడడం, అధిక మానసిక ఒత్తిడి గుప్పిట్లో చిక్కడం లాంటి కారణాల వల్ల జీవక్రియ ఆరోగ్య సంక్షోభానికి లేదా ఇన్సులిన్ నిరోధకతకు దారి తీస్తుంది. ఇన్సులిన్ నిరోధకత నివారణకు ప్యాకెట్ ప్రాసెస్డ్ ఫుడ్స్, నిలువ ఉంచిన ఆహారం, జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్, కృత్రిమ చక్కెరలు, తీపి పాల ఉత్పత్తులు, రుచి కలిగిన పెరుగు, వేపుడు ఆహారం, చక్కెర పానీయాలకు దూరంగా చక్కటి ఆరోగ్యకర ఆహార అలవాట్లను పాటించాలి. ప్రతి రోజు క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలి. శరీర బరువును తగ్గించుకోవడం, మానసిక ఒత్తిడికి ఆస్కారం ఇవ్వకపోవడం, నిద్రకు తగిన సమయం కేటాయించడం లాంటి జీవనశైలి మార్పులను పాటించాలి. ఆకు కూరలు, తృణధాన్యాలు, చిక్కుళ్ళు, కొవ్వు చేపలు, తగినంత ప్రోటీన్ ఆహారం, దాల్చిన చెక్క, సుగంధ ద్రవ్యాలు తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ పెరుగుతుంది. డిజిటల్ యుగపు యువత అసాధారణ జీవనశైలి, అవాంఛనీయ ఆహారపు అలవాట్లతో క్రమంగా జీవక్రియ ఆహార సంక్షోభం వైపు పయనిస్తున్నారు. దీని వల్ల తిరిగి కోలుకోలేని టైప్–2 మధుమేహం బారిన పడడం జరుగుతున్నది. ఈ విషయాల గంభీరతను దృష్టిలో పెట్టుకొని తమ తమ జీవనశైలిల్లో సకారాత్మక మార్పులు చేసుకుంటూ డయాబెటెస్‌కు దూరంగా ఆరోగ్యకర జీవితాలను అనుభవిద్దాం. జీవక్రియ సిండ్రోమ్ లేదా సంక్షోభానికి చరమ గీతం పాడుదాం.

### టీడీపీ వర్క్‌షాప్... కార్యకర్తల మధ్యలో

# కూర్చున్న చంద్రబాబు

నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినా, తెలుగుదేశం పార్టీలో మాత్రం తాను ఒక సామాన్య కార్యకర్తనే అని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి చాటిచెప్పారు. అధికారిక హోదాలు, ప్రోటోకాల్ పక్కనపెట్టి, పార్టీ ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో ఆయన కార్యకర్తల మధ్యలో కూర్చుని నాయకులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌లో ఆయన నిరాడంబరత అందరినీ ఆశ్చర్యపరిచింది, స్ఫూర్తినింపింది.

మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో 25 పార్లమెంట్ కమిటీల కోసం తెలుగుదేశం పార్టీ ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఒక్కో కమిటీ నుంచి 42 మంది చొప్పున మొత్తం 1,050 మంది సభ్యులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబుతో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్ జరుగుతున్న వివిధ గదుల్లోకి స్వయంగా వెళ్లిన చంద్రబాబు, అక్కడి నాయకులు, కార్యకర్తల మధ్యలో కూర్చుని వారితో మమేకం అయ్యారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు నూతన పార్లమెంట్ అధ్యక్షులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతిలోనూ ఆయన సాధారణ సభ్యుడిలా హాజరై, నేతలు చెప్పే విషయాలను శ్రద్ధగా విన్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి తమతో పాటు కూర్చోవడంతో అక్కడున్న నాయకులు, కార్యకర్తలు మొదట ఆశ్చర్యానికి గురయ్యారు. ఆయన చూపిన చొరవ, నిబద్ధత తమలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని వారు అభిప్రాయపడ్డారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి 'కార్యకర్తే అధినేత' అనే సిద్ధాంతాన్ని నమ్ముతామని, దానికి అనుగుణంగానే తాను ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని చంద్రబాబు పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, నాలుగున్నర దశాబ్దాల ప్రయాణం, క్యాడర్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ఆయన నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో కూటమి ప్రభుత్వ విజయాలు, భవిష్యత్ ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలు, విజన్ ప్లాన్‌లపై కూడా సభ్యులకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలోనే ఉన్న నారా లోకేశ్ కూడా ప్రతి బృందం సభ్యులతోనూ ముచ్చటించారు. చంద్రబాబు తన హోదాను పక్కనపెట్టి సామాన్య కార్యకర్తగా ఒదిగిపోయిన విధానం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ ఘటన పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

## పార్టీ సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. పార్టీ అనేది సొంతిల్లు వంటిదని, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిదని అభివర్ణించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నూతనంగా నియమితులైన పార్లమెంట్ కమిటీల కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు.

పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యాలయానికి తగిన సమయం కేటాయించాలని లోకేశ్ సూచించారు. "పార్టీ మన సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. చంద్రబాబు గారికి ఎంత పని ఒత్తిడి ఉన్నా వారానికి ఒకసారి పార్టీ ఆఫీసుకు వచ్చి కార్యకర్తలను కలుస్తున్నారు, శిక్షణ కార్యక్రమాలకు హాజరవుతున్నారు" అని గుర్తుచేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వం ఉందని, కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసికట్టుగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. కేంద్ర సహకారంతోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగామని, అమరావతి, పోలవరం పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ కూడా తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

### అభివృద్ధికి ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరం

పార్టీ నాయకులు చిన్న చిన్న అలకలు వీడి ఐక్యంగా పనిచేయాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మనపై ఎన్నో అక్రమ కేసులు పెట్టారు. ఇప్పుడు అలకల వల్ల మనమే నష్టపోతాం. ఏదైనా సమస్య ఉంటే పార్టీలోనే పోరాడాలి" అని హితవు పలికారు. కనీసం 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వం అధికారంలో కొనసాగితేనే రాష్ట్రాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసుకోగలమని పవన్ కల్యాణ్ కూడా చెప్పారని గుర్తుచేశారు. కూటమిలో చిన్న చిన్న సమస్యలు సహజమని, వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగాలన్నారు. మన మధ్య విభేదాలు సృష్టించడానికి వైసీపీ ప్రయత్నిస్తుందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# పనితీరు బాగోకపోతే పదవులు ఊడతాయి

- మొదటి పేజి తరువాయి

చేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. "ప్రజల భూముల పట్టాదారు పాసుపుస్తకాలపై, పొలం సరిహద్దు రాళ్లపై కూడా వాళ్ల ఫొటోలు ముద్రించుకున్నారు. చరిత్రలో ఎప్పుడైనా ఇలా జరిగిందా? ప్రజల ఆస్తుల జుట్టు వాళ్ల చేతుల్లో పెట్టుకుని ఆడించాలని చూశారు. అందుకే ఆ లోపభూయిష్టమైన చట్టాన్ని రద్దు చేశాం. ఏడాదిలోగా మళ్లీ సర్వేలు చేసి, ఎలాంటి సమస్యలు లేని పట్టాదారు పుస్తకాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారు. అమరావతి విషయంలో గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని, ఇప్పుడు మళ్లీ తాము రాజధానికి జీవం పోశామని అన్నారు. అమరావతే ఏకైక రాజధాని అని స్పష్టం చేస్తూనే, అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ ధ్యేయమని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని పునరుద్ఘాటించారు. భోగాపురం విమానాశ్రయంలో 500 ఎకరాలు కొట్టేయాలని చూశారని, పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు.

### కార్యకర్తే అధినేత.. వారికి అండగా ఉండాలి

పార్టీలో కార్యకర్తే అధినేత అని, వారికి న్యాయం జరిగినప్పుడే పార్టీ శాశ్వతంగా ఉంటుందని చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లలో కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారని, పసుపు జెండా కోసం రక్తం చిందించారని గుర్తుచేశారు. "ఏ పని జరిగినా కార్యకర్తలకు గుర్తింపు ఉండాలి. నాయకులెవరూ కేడర్‌ను విస్మరించవద్దు. వారితో నిరంతరం అనుసంధానమై ఉండాలి" అని ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. "మనం చేసే పనులు ఎంత ముఖ్యమో, మనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం కూడా అంతే ముఖ్యం. సోషల్ మీడియాలోనే కాదు, మౌత్ టు మౌత్ పబ్లిసిటీతో ప్రజలకు వాస్తవాలు వివరించాలి," అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సూపర్ 6 హామీలను సూపర్ హిట్ చేశామని, డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాల భర్తీతో పాటు రోడ్ల మరమ్మతులు వేగవంతం చేశామని వివరించారు. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ కూటమి గెలిచేలా ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని కోరారు.

### ఢిల్లీలో చారిత్రక ఘట్టం.. భారత్-ఈయూ

# 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్' ఖరారు

భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య చారిత్రక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) ఖరారైంది. 18 ఏళ్ల సుదీర్ఘ చర్చల తర్వాత కుదిరిన ఈ ఒప్పందాన్ని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. ఈరోజు న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా, కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టాలతో జరిగిన 16వ శిఖరాగ్ర సమావేశంలో ఈ ఒప్పందాన్ని అధికారికంగా ఖరారు చేశారు. ఈ ఒప్పందం ద్వారా భారత్ నుంచి జరిగే 97 శాతం ఎగుమతులపై సుంకాలు రద్దు కానున్నాయి. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, రత్నాలు, లెదర్ వంటి రంగాలకు ఇది భారీ ఊతాన్ని ఇవ్వనుంది. అదే సమయంలో యూరప్ కార్లు, యంత్ర పరికరాలకు భారత మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం అవుతుంది. "ఈరోజు యూరప్, భారత్ చరిత్ర సృష్టిస్తున్నాయి. మేం 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'ను ముగించాం. ఇరుపక్షాలకు ప్రయోజనం చేకూర్చేలా 200 కోట్ల మంది ప్రజలతో స్వేచ్ఛా వాణిజ్య క్షేత్రాన్ని సృష్టించాం" అని ఉర్సులా 'ఎక్స్' వేదికగా తెలిపారు.

ఈ ఒప్పందం రెండు ప్రపంచ దిగ్గజాల మధ్య భాగస్వామ్యానికి చక్కటి ఉదాహరణ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వాణిజ్యంతో పాటు రక్షణ, భద్రత, వాతావరణ మార్పులు, కీలక సాంకేతికతలు వంటి అంశాలపై కూడా ఇరుపక్షాలు దృష్టి సారించాయి. అమెరికా, చైనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకుని, ఇతర ప్రాంతాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని చూస్తున్న ఐరోపాకు ఈ ఒప్పందం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ఒప్పందం వచ్చే ఏడాది నుంచి అమల్లోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

# మేము సూపర్‌పవర్‌గా మారాలంటే భారత్‌తో వ్యాపారం చేయాల్సిందే

భారత పర్యటనలో ఉన్న కెనడా ఇంధన, సహజ వనరుల మంత్రి టిమ్ హాడ్గ్‌సన్ ఇరు దేశాల మధ్య వ్యాపార సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఇంధన మార్కెట్‌లలో ఒకటిగా ఎదుగతోందని, ఈ నేపథ్యంలో ఇంధన రంగంలో కెనడా అగ్రగామిగా నిలవాలంటే భారత్‌తో వ్యాపారం చేయడం ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. గోవాలో జరుగుతున్న భారత ఇంధన వారోత్సవాలకు కెనడా మంత్రి టిమ్ హాడ్గ్‌సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇరు దేశాల ఇంధన సహకారానికి ఈ వారోత్సవాలు ఒక మంచి వేదికని అన్నారు. భారత్, కెనడా మధ్య వాణిజ్య సంబంధాలను, ఇంధన వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. చమురు, గ్యాస్ వాణిజ్యాన్ని విస్తరించడానికి ఒట్టావా నుంచి భారత్‌కు ముడిచమురు, పెట్రోలియం, సహజ వాయువులను రవాణా చేయడానికి కెనడా సంసిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. అంతకుముందు టిమ్ హాడ్గ్‌సన్ 'ఎక్స్' వేదికగా తన భారత పర్యటన గురించి స్పందిస్తూ, భారత్‌లో జరుగుతున్న ఇంధన వారోత్సవాల్లో పాల్గొనడం తన తొలి పర్యటన అని పేర్కొన్నారు. కాగా, వాణిజ్యం, కీలక ఖనిజాలు, ఇంధనం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించే దిశగా భారత్, కెనడా అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. కెనడా వాణిజ్య మంత్రితో చర్చల అనంతరం భారత పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య పలు వాణిజ్య ఒప్పందాలపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. హైడ్రోజన్, బయో ఇంధనాలు, బ్యాటరీ నిల్వ, కీలకమైన ఖనిజాలు, విద్యుత్ వ్యవస్థలు, ఇంధన పరిశ్రమలో కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలపై దృష్టి సారించినట్లు ఆయన వెల్లడించారు. 2050 నాటికి ప్రపంచ ఇంధన డిమాండ్‌లో భారత్ వాటా 30 శాతం నుంచి 35 శాతానికి పెరుగుతుందని అంచనా వేయగా, తద్వారా భారత్ మూడవ అతిపెద్ద ఇంధన మార్కెట్‌గా అవతరిస్తుందని ఆయన అన్నారు.

# ముగిసిన హల్వా వేడుక...

- మొదటి పేజి తరువాయి

రహస్య సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు దశాబ్దాలుగా ఈ కఠిన నిబంధనను పాటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి అధికారులకు హల్వాను వడ్డించి, శుభాకాంక్షలు తెలిపారు. హల్వా వేడుక అనంతరం నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రెస్‌ను సందర్శించారు. అక్కడ బడ్జెట్ పత్రాల ముద్రణకు సంబంధించిన తుది ఏర్పాట్లను సమీక్షించారు. బడ్జెట్ రూపకల్పన, ముద్రణ పనుల్లో నిమగ్నమైన సిబ్బందికి, అధికారుల బృందానికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని వివిధ విభాగాల కార్యదర్శులు, బడ్జెట్ తయారీ ప్రక్రియతో సంబంధం ఉన్న ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

### డిజిటల్ రూపంలో బడ్జెట్ పత్రాలు

గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్న విధానాన్ని కొనసాగిస్తూ, ఈసారి కూడా బడ్జెట్ పత్రాలన్నీ ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేందుకు డిజిటల్ రూపంలో విడుదల చేయనున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వార్షిక ఆర్థిక నివేదిక (బడ్జెట్), పద్దుల కేటాయింపులు (డిమాండ్ ఫర్ గ్రాంట్స్), ఆర్థిక బిల్లు వంటి కీలక పత్రాలన్నీ 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్'

ద్వారా లభిస్తాయి. పార్లమెంటు సభ్యులు, సాధారణ ప్రజలు ఈ యాప్ ద్వారా బడ్జెట్ వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫామ్‌లపై అందుబాటులో ఉంది. అలాగే, అఅఎఖుఎబనస్త్రవ్.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా కూడా పత్రాలను యాక్సెస్ చేయవచ్చు. అయితే, ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే ఈ పత్రాలు యాప్‌లో, వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# జోగి రమేశ్ ను కలిసిన కేతిరెడ్డి... కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

"జోగి రమేశ్ ను కలిసేందుకు ఆసుపత్రికి వెళ్లిన కుటుంబ సభ్యులపైనా కేసు పెట్టారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఎలా ఉందో అంతా చూస్తున్నారు. మర్డర్లు చేసిన వారిపై కేసు పెట్టడం లేదు. కోడిని, గొర్రెలను కోసిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు. అక్రమంగా జైళ్లకు పంపిస్తే రెట్టించిన ఉత్సాహంతో మావాళ్లు పనిచేస్తారు. కూటమి ప్రభుత్వం తప్పిదాలపై జోగి రమేశ్ పోరాటం చేస్తూనే ఉంటారు" అని కేతిరెడ్డి అన్నారు. "ధర్మవరంలో 70 శాతం కల్తీ మద్యం దొరుకుతోంది. కల్తీ మద్యం తయారు చేసేది నీ జిల్లా నుంచే చంద్రబాబు. బెల్టుషాపులు లేకుండా చేస్తానన్నావ్. కానీ ఇప్పుడు ఊరికి నాలుగు బెల్టు షాపులు ఉన్నాయి. వేలంపాటలో బెల్ట్ షాపులు పాడుకుంటున్నారు. గిట్టుబాటు కావడం కోసం కల్తీ మద్యం అమ్ముతున్నారు. కొన్ని రోజుల క్రితం కడప జిల్లాలో ఇద్దరు చనిపోయారు. మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్ కింద తనపై ఉన్న కేసును కొట్టేయించుకోవాలని చంద్రబాబు చూస్తున్నాడు. చంద్రబాబుపై ఉన్న కేసులను మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్స్ అని ఎలా తొలగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. "చట్టం అందరికీ ఒకటే. కేసులు తీసేయించుకోవాలని చూస్తున్న ప్రయత్నంపై అప్పీల్‌కు వెళతాం. మద్యం సీసాలపై క్యూఆర్ కోడ్ మేం అధికారంలో ఉన్నప్పుడే తెచ్చాం. మంచి మద్యం ఇస్తానని చంద్రబాబు చెబితే అందరూ ఈలలు వేశారు. మంచి విద్య, వైద్యం ఇస్తామని జగన్ చెప్పితే ఎవరూ చప్పట్లు కొట్టలేదు. నేను ఇది చేశానని చెప్పి గడప గడపకు వెళ్లాలంటే ధైర్యం కావాలి. జగన్ ఎమ్మెల్యేలందరినీ ప్రజల ఇళ్ల వద్దకు పంపించారు. నాపై ఆరోపణలకు ఎందుకు ఆధారాలు చూపలేకపోతున్నారు. చేతనైతే వాటిపై చర్యలు తీసుకోండి" అని సవాల్ విసిరారు. "తిరుపతి లడ్డూలో పందికొవ్వు కలిపారని సీఎం, డిప్యూటీ సీఎం ప్రచారం చేశారు. ఈ రోజు లడ్డూలో అలాంటిదేమీ లేదని తేలింది. తాము ఒకటి చేయాలనుకుంటే మరొకటి జరిగిందని కూటమి నేతలు బాధపడుతున్నారు. ఇలాంటి దుష్ప్రచారాలు చేసేవాడు హిందూమతాన్ని కాపాడతాడా? నకిలీ మద్యం విషయంలో తప్పుడు ఆధారాలతో బురదజల్లారు. దీనిపై లీగల్‌గా ఫైట్ చేస్తాం. మమ్మల్ని ఇబ్బంది పెట్టినవారిని ఎవరినీ వదలం" అని హెచ్చరించారు.

# పడిపోతున్న డాలర్.. నిలకడగా రూపాయి

ప్రపంచ కరెన్సీ మార్కెట్లలో తీవ్ర ఒడుదొడు కులు కొనసాగుతున్నాయి. ప్రధాన కరెన్సీల తో పోలిస్తే అమెరికా డాలర్ బలహీనపడు తుండగా, భారత రూపాయి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. డాలర్ బలహీనత కారణంగా భారత్‌లోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ మంగళవారం విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు, అంతర్జాతీయ పరిణామాల కారణంగా డాలర్ విలువ పడిపోతోందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సుమారు రూ.90 వద్ద నిలకడగా ఉందని, స్వల్పకాలంలో ఇదే స్థాయిలో కన్సాలిడేట్ కావొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్లు తెలిపింది. భారత్ నికర దిగుమతిదారుగా ఉండటం రూపాయిపై భారం మోపుతున్నప్పటికీ, విదేశీ పెట్టుబడులకు అవకాశాలు మెరుగుపడటం మద్దతుగా నిలుస్తుందని వివరించింది. గత 18 నెలలుగా భారత ఈక్విటీ మార్కెట్లలో విదేశీ సంస్థలు నికర అమ్మకందారులుగా ఉన్నాయి. దీంతో పలు రంగాల్లో షేర్ల విలువ ఆకర్షణీయంగా మారింది. అమెరికాలో వడ్డీ రేట్లు తగ్గితే, డాలర్‌పై రాబడి తగ్గి, భారత్ వంటి వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. "బలహీనపడిన డాలర్, వర్ధమాన మార్కెట్ల వైపు పెట్టుబడుల మళ్లింపు వంటివి అవకాశాలను, అదే సమయంలో నష్టభయాలను కూడా సృష్టిస్తున్నాయి. భారత్‌లో స్థిరమైన ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో విదేశీ పెట్టుబడులు కొనసాగితే, ప్రపంచ ఒడుదొడుకులు ఉన్నప్పటికీ రూపాయి ప్రస్తుత స్థాయిలోనే కొనసాగవచ్చు" అని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ సేల్స్ హెడ్ పరాగ్ మోరే వివరించారు. 2025 ప్రారంభం నుంచి డాలర్ ఇండెక్స్ దాదాపు 9 శాతం పడిపోయి 98.60 వద్ద ఉంది. అయితే, సముద్ర రవాణా మార్గాలకు అంతరాయాలు లేదా ముడిచమురు సరఫరాలో సమస్యలు తలెత్తితే స్వల్పకాలంలో డాలర్‌కు మళ్లీ డిమాండ్ పెరిగే ప్రమాదం ఉందని, కాబట్టి హెడ్జింగ్ వ్యూహాలు పాటించడం మంచిదని నివేదిక సూచించింది.

### దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె...

# స్తంభించిన సేవలు

వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు మంగళవారం సమ్మెకు దిగారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు జరిగిన ఈ సమ్మెతో బ్యాంకింగ్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్, చెక్కు క్లియరెన్సులు వంటి రోజువారీ లావాదేవీలు నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేశంలోని దాదాపు అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. గుజరాత్‌లోని వడోదర, పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్, ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ సహా అనేక నగరాల్లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఐదు రోజుల పని విధానం కోసం ప్రభుత్వానికి చాలాసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. "ఈరోజు సమ్మెలో దేశవ్యాప్తంగా 8 లక్షల మందికి పైగా ఉద్యోగులు పాల్గొంటున్నారు. 2015 నుంచి మా డిమాండ్ పెండింగ్‌లోనే ఉంది. ఎల్ఐసీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే వారానికి 5 రోజుల పనివిధానం అమలవుతోంది. బ్యాంకుల్లోనూ అమలు చేస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు" అని ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో జరిగిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఆరు నెలల్లోనే 5 రోజుల పనిదినాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండేళ్లు గడిచినా ఆ హామీ నెరవేరలేదని పాట్నాలో ఉద్యోగులు తెలిపారు. "ఆర్‌బీఐ, నాబార్డ్, సెబీ వంటి సంస్థలన్నీ 5 రోజులే పనిచేస్తున్నాయి. మాకు మాత్రం ఎందుకు అమలు చేయడం లేదు?" అని వారు ప్రశ్నించారు. యూపీలోని ఘాజీపూర్ జిల్లాలో దాదాపు 250 బ్యాంకులకు చెందిన 10,000 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో సుమారు రూ.150 కోట్ల విలువైన లావాదేవీలు నిలిచిపోయాయి. ప్రభుత్వ హామీ నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి.

### ఏపీకి రానున్న రాహుల్ గాంధీ...

# షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్

ఏపీ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని ఆమె చేసిన ఆహ్వానానికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ఏపీ పర్యటనకు వస్తానని, పార్టీ పోరాటంలో భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చినట్టు షర్మిల తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని 10 జనపథ్‌లో ఉన్న రాహుల్ గాంధీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందిగా షర్మిల రాహుల్‌ను కోరారు. ఇందుకు రాహుల్ అంగీకరించారని, త్వరలోనే ఏపీకి వస్తానని మాట ఇచ్చారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 2వ తేదీతో ఉపాధి హామీ పథకం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తికానుంది. ఈ నేపథ్యంలో, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు షర్మిల వివరించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆమె వెల్లడించారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం। అనకాపల్లి। అల్లూరి జిల్లా

# సిక్కోలు బృందానికి డిల్లీలో సన్మానించిన రామ్మోహన్ నాయుడు

- రిపబ్లిక్ డే వేడుకల్లో భరతనాట్యంతో అలరించిన శ్రీకాంత్ బృందం.
- నేడు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో శ్రీకాంత్ బృందం భేటి.
- సిక్కోలు కీర్తి చాటేలా మంచి ప్రదర్శన ఇచ్చారంటూ కితాబిచ్చిన రామ్మోహన్ నాయుడు.



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం జనవరి 27 :** దేశ రాజధాని డిల్లీలోని కర్తవ్యపద్ లో నిన్న జరిగిన 77వ రిపబ్లిక్ డే వేడుకలల్లో సాంస్కృతిక ప్రదర్శన చేసిన శ్రీకాకుళానికి చెందిన రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం మంగళవారం నాడు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తో భేటి అయ్యారు. డిల్లి అక్బర్ రోడ్డులోని తన నివాసానికి విచ్చేసిన ఈ సిక్కోలు బృందానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆత్మీయ స్వాగతాన్ని పలికారు. రిపబ్లిక్ డే వేడుకలలో శ్రీకాకుళం కీర్తి చాటేలా మంచి ప్రదర్శన ఇచ్చారని కితాబిచ్చారు. తన తరపున పూర్తి ప్రోత్సాహం ఉంటుందని.. భవిష్యత్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో మరిన్ని వేదికలపై మంచి ప్రదర్శనలు ఇవ్వాలని ఆకాంక్షించారు. రిప్లబిక్ డే వేడుకల లాంటి ఉన్నతమైన వేదికలో తమ ప్రదర్శనకు అవకాశం లభించేలా పూర్తి తోడ్పాటు అందించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు.. నృత్య శిక్షకుడు రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## సన్యాసిరావు కు ఉత్తమ ప్రశంసా పత్రం....



**నాతవరం,పెన్ పవర్ ( జనవరి 27):** నాతవరం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న టి.సన్యాసిరావు (పిసి 360) కి గత నాలుగు సంవత్సరాలుగా పరారీలో ఉన్న గంజాయి కేసు ముద్దాయిని ఢిల్లీలో పట్టుకోవడంలో కీలకంగా సహకరించి అంకితభావంతో ప్రతిభ చూపినందుకు గణతంత్ర దినోత్సవ సందర్భంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్,జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా చేతుల మీదుగా ఉత్తమ ప్రశంస పత్రం,పురస్కారం అందజేయడం జరిగిందని ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. ఉత్తమ ప్రతిభ ప్రశంస పత్రం అందుకున్న సన్యాసిరావుని ఎస్సై తో పాటు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

# జిల్లా అభివృద్ధికి రూ. 1,743 కోట్ల అంచనా బడ్జెట్






**జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన ఏకగ్రీవ ఆమోదం**

**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ శ్రీకాకుళం, జనవరి 27:**
జిల్లా ప్రగతిని కాంక్షిస్తూ రూపొందించిన 2026-27 ఆర్థిక సంవత్సరపు వార్షిక అంచనా బడ్జెట్‌కు శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో రూ. 1,743.35 కోట్ల ఆదాయ అంచనాలతో కూడిన నివేదికను సభ ముందు ఉంచారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఈ నిధులు తోడ్పడతాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

బడ్జెట్ వివరాలు..

జిల్లా పరిషత్ సీఈఓ సత్యనారాయణ ప్రవేశపెట్టిన నివేదిక ప్రకారం.. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం రూ. 1,743.37 కోట్లు కాగా, వ్యయం రూ. 1,671.71 కోట్లగా ఉంటుందని అంచనా వేశారు. తద్వారా రూ. 71.65 కోట్లు మిగులు బడ్జెట్‌గా పేర్కొన్నారు. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 1718 కోట్ల సవరణ బడ్జెట్‌ను సభ ఆమోదించింది. జిల్లా పరిషత్ సాధారణ నిధుల ద్వారా రూ. 7.91 కోట్ల ఆదాయం సమకూరుతుందని అధికారులు వివరించారు. ఇందులో సీనరేజీ ద్వారా రూ. 6.20 కోట్లు, స్టాంపు డ్యూటీ సర్ఛార్జి ద్వారా రూ. 57.10 లక్షలు, తలసరి గ్రాంటు రూపంలో రూ. 1.08 కోట్లు రానున్నట్లు వెల్లడించారు.

పారదర్శకతే లక్ష్యం

ఈ సమావేశంలో పాల్గొన్న ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ.. ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా అధికారులు పూర్తి పారదర్శకత పాటించాలని సూచించారు. గత ఐదేళ్ల ఖర్చులకు సంబంధించి త్రైమాసిక వారీగా రికన్సిలేషన్ నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, త్వరలోనే అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇళ్ల స్థలాలు కేటాయించనున్నట్లు ప్రకటించారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గ రమణమూర్తి మాట్లాడుతూ జిల్లా పరిషత్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ బడ్జెట్ సమావేశంలో జడ్పీ సీఈఓ డి.సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, వివిధ మండలాల జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పంచాయతీరాజ్, హౌసింగ్, డీఆర్‌డీఏ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శాలిహుండం శ్రీ వేణుగోపాల స్వామి యాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

**చక్రతీర్థ స్నానాలకు వంశధార నదీ తీరంలో ప్రత్యేక భద్రత జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ.**



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం జనవరి 27 :** గార మండలం, శాలిహుండంలోని శ్వేతగిరిపై 28 , 29 తేదీల్లో నిర్వహించనున్న శ్రీ వేణుగోపాలస్వామి వారి యాత్ర నేపథ్యంలో పటిష్ఠ భద్రత, బందోబస్తు, రాకపోకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నెల 29వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు కొండపైకి తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. క్యూ లైన్ల నిర్వహణ, క్రౌడ్ కంట్రోల్, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా జనవరి 29వ తేదీ ఉదయం ఉత్సవ మూర్తులకు వంశధార నదీ తీరంలో నిర్వహించనున్న చక్రతీర్థ స్నాన కార్యక్రమానికి పటిష్ట భద్రత కల్పించాలని స్పష్టంగా ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంతంలో గజ ఈతగాళ్ల (లైఫ్ గార్డులు) ఏర్పాటు, బ్యారికేడింగ్, భక్తుల నియంత్రణకు అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అపఘాతాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. యాత్ర మార్గాల్లో ముఖ్యమైన ప్రదేశాల్లో అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని,భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, తాగునీరు, వైద్య సేవలు, శౌచాలయాల ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా రద్దీ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, కమాండ్ కంట్రోల్ వ్యవస్థను సమర్థంగా వినియోగించాలని, అన్ని శాఖల మధ్య సమన్వయంతో ముందస్తు ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.భక్తులు శాంతియుతంగా, సురక్షితంగా స్వామివారి దర్శనం చేసుకునేలా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

# బాగర్‌హాట్ జైలు నుంచి 23 మంది భారతీయ మత్స్యకారులకు విముక్తి

**భారత్‌బంగ్లాదేశ్ అధికారుల సమన్వయంతో మోంగ్లా పోర్టుకు తరలింపు**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 27:**బంగ్లాదేశ్‌లోని బాగర్‌హాట్ జైల్లో నిర్బంధంలో ఉన్న 23 మంది భారతీయ మత్స్యకారులను బంగ్లాదేశ్ ప్రభుత్వం మంగళవారం అధికారి కంగా విడుదల చేసింది. ఈ కార్యక్రమానికి బంగ్లాదేశ్ హోంశాఖ డిప్యూటీ సెక్రటరీ మహ మ్మద్ అఫీజ్ ఆల్ అసాద్ ప్రత్యేకంగా డాకా నుంచి బాగర్‌హాట్‌కు వచ్చి హాజరయ్యారు.

భారత ప్రభుత్వ తరపున కుల్నాలోని అసిస్టెంట్ హై కమిషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి చంద్రజీత్ డిప్యూటీ హై కమిషన్ కౌన్సిలర్ జైలుకు చేరుకొ ని బంగ్లాదేశ్ హోం శాఖ డిప్యూటీ సెక్రటరీ, బాగర్‌హాట్ జిల్లా మేజిస్ట్రేట్, జైలు సూపరింటెం డెంట్‌లతో సమావేశమయ్యారు. ఈ సమావేశం లో ఈస్ట్ కోస్ట్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అ సోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వాసుప ల్లి జానకిరామ్ కూడా పాల్గొని మత్స్యకారుల విడుదలకు సంబంధించిన పూర్తి డాక్యుమెంటే షన్‌ను పూర్తి చేశారు.ఈ సందర్భంగా బంగ్లాదేశ్ డిప్యూటీ సెక్రటరీ మాట్లాడుతూ, జైల్లో ఉన్న సమయంలో భారతీయ మత్స్యకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. మత్స్య కారులనే ప్రత్యక్షంగా అడిగి, వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయా లేదా అనే విషయాన్ని కూడా తెలుసుకున్నారు. భారత్ బంగ్లాదేశ్ మధ్య ప్రస్తుత ద్వైపాక్షిక సంబంధాలు కొంత ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, మత్స్య కారుల పట్ల మానవీయ దృక్పథంతో జైళ్లకు ప్రత్యేక అధికారులను పంపి పర్యవేక్షణ చేశామ ని జానకిరామ్‌కు వివరించారు.సమావేశం అనంతరం 23 మంది భారతీయ మత్స్యకారు లను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య బాగర్‌హాట్ జైలు నుంచి మోంగ్లా పోర్టుకు తరలించారు. మోంగ్లా పోర్టుకు చేరుకున్న తర్వాత, అక్కడి పోలీస్ స్టేషన్ కస్టడీలో ఉన్న వారి బోట్ల వద్దకు మత్స్యకారులను తీసుకెళ్లి, భారత్‌కు పంపే ప్రక్రియ చేపట్టనున్నారు.

ఈ అధికారిక కార్యక్రమంలో మోంగ్లా పోర్టు పోలీస్ అధికారులు, బాగర్‌హాట్ జైలు సూపరింటెండెంట్, జైలర్, బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్ అధికారులు, భావిహార్ జిల్లా మేజిస్ట్రేట్ తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం సీజ్ చేసిన బోట్లకు సంబంధించిన రిపేర్ పనులు కొనసాగు తున్నాయని, అవి రేపటిలోగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29వ తేదీన అంతర్జాతీయ జలాల్లో బంగ్లా దేశ్‌భారత్ కోస్ట్ గార్డ్ అధికారుల సమక్షంలో, రెండు దేశాల విదేశాంగ ఒప్పందాల మేరకు మత్స్యకారులను భారత్‌కు అప్పగించనున్నా రు. రేపు అధికారుల పర్యవేక్షణలో మత్స్యకారు లు భారతదేశానికి బయలుదేరనున్నారు.

మత్స్యకారుల విడుదలకు సహకరించిన డాకాలోని ఇండియన్ హై కమిషన్, కుల్నా అసిస్టెంట్ హై కమిషన్, బంగ్లాదేశ్ ప్రభుత్వ అధికారులు, జైలుపోలీస్ శాఖలు, బాగర్‌హాట్ జిల్లా మేజిస్ట్రేట్, అడ్వకేట్ మిలిన్ బెనర్జీతో పాటు ఈ ప్రక్రియలో సహకరించిన భారతదేశంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులందరికీ మత్స్యకారుల తరపున వాసుపల్లి జానకిరామ్ కృతజ్ఞతలు తెలిపారు.మోంగ్లా పోర్టుకు చేరుకున్న అనంతరం విడుదలైన మత్స్యకారుల్లోని 9 మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మత్స్యకారులు తమ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి భావోద్వేగానికి గురయ్యారు. తాము క్షేమంగా ఉన్నామని, మరో నాలుగు నుంచి ఐదు రోజుల్లో విశాఖపట్నం చేరుకుంటా మని కుటుంబ సభ్యులకు జానకిరామ్ భరోసా ఇచ్చారు.



# జంగిల్ క్లియర్ చేసిన గడ్డిబంద గ్రామస్తులు



- పోరాటాల ఫలితమే జంగిల్ క్లియరెన్స్ కు ఆదేశాలు.
- గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 27.**మండలంలో గల కించాయిపుట్టు పంచాయితీ పరిధిలో జోలపుట్టు ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఇంద్రకొలనీ వయ గడ్డిబంద గ్రామం వరకు పిఆర్ రోడ్డు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, తుప్పలు గడ్డిబంద గ్రామస్తులు తొలగించరానీ, జంగిల్ క్లియరెన్స్ పై పలుమార్లు చేసిన పోరాట ఫలితమే నేడు అధికారులు జంగిల్ క్లియరెన్స్ చేపట్టుటకు ఆదేశాలు ఇచ్చారని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జంగిల్ క్లియరెన్స్ లేకపోవడం వల్ల కొద్ది రోజులుగా ఆటోలు, జీపులు మోటార్ సైకిల్స్ వంటి వాహనాలు నడపడాలంటే గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురి అవుతూ తుప్పల మధ్యలో చిన్న చిన్న గాయాలయ్యాయి అన్నారు. రహదారిలో జంగిల్ క్లియరెన్స్ పై రాములు క్లస్టర్ పెసా ఉపాధ్యక్షులు కిల్లో నారాయణ, కార్యదర్శి కిలో పద్మనాభం పడాల్, దారపల్లి పిసా వైస్ ప్రెసిడెంట్ కొంజియా జయరాం లతో కలిసి గత రెండు సంవత్సరాలుగా గ్రామ సభలలో పలు దఫాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టమని, ఈ విషయమై దరఖాస్తులు, ఫిర్యాదులు అర్జీలు సమర్పించమన్నారు. ఆ పోరాటాల ఫలితమే పంచాయతీ ఇన్చార్జి సెక్రటరీ చిన్న జంగిల్ క్లియరెన్స్ కు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ మేరకే దారపల్లి నుండి రాములు వరకు జంగిల్ క్లియర్ చేయుటకు మంగళవారం నుండి పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిబంద గ్రామస్తులు రామ్మూర్తి, లోబో, మల్లేష్, కిరణ్, బుద్రన్న తోపాటు, పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఉత్తమ అధికారిగా గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.సూరిబాబు

- ట్రాఫిక్ నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతకు ప్రతీకగా ప్రశంసలు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 27 :** గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా ట్రాఫిక్ ఎస్ఐ ఆర్. సూరిబాబు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి వేడుకల్లో విశాఖపట్నం సిటీ పోలీస్ విభాగానికి చెందిన ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్. సూరిబాబును జిల్లా కలెక్టర్ ఉత్తమ అధికారిగా ప్రశంసించడం విశేషంగా నిలిచింది. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయన అందిస్తున్న సేవలు ప్రజా భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ట్రాఫిక్ నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతకు ప్రతీకగా నిలుస్తున్నారు. ముఖ్యంగా గోపాలపట్నం ప్రాంతంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహన రద్దీని సమర్థవంతంగా నియంత్రించడం, ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాల్లో ఆయన ప్రత్యేకంగా గుర్తింపు పొందారు.

పండుగలు, శుభకార్యాలు, రాజకీయ మరియు సామాజిక కార్యక్రమాల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం ఆయన పని శైలిలోని ముఖ్య లక్షణంగా చెప్పుకోవచ్చు. అలాగే నిబంధనల అమలులో కఠినంగా ఉంటూనే, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించడం వల్ల ట్రాఫిక్ పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడింది. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వచ్చిన ఈ ప్రశంసా పురస్కారం ఆయన వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా, ట్రాఫిక్ పోలీస్ విభాగం మొత్తం చేస్తున్న సేవలకు ప్రతిబింబంగా భావించవచ్చు. ఇది ఇతర పోలీస్ అధికారులకు కూడా ప్రేరణగా నిలిచి, ప్రజాసేవలో మరింత నిబద్ధతతో పనిచేయడానికి దోహదపడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఘనంగా ఎల్లపువాణిపాలెం రజకకాలనీలో బల్లల పండుగ నిర్వహణ



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 27 :** జీవీఎంసీ, 89వ వార్డు పరిధిలోని ఎల్లపువాణి పాలెం రజకకాలనీలో రజక సమాజ సభ్యుల ఆహ్వానం మేరకు బల్లల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఎస్. శ్రీనివాసరావు, స్థానిక పెద్దలు జి. బాబురావు, రజక కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని పండుగ వేడుకలను మరింత వైభవంగా నిలిపారు. సంప్రదాయ పూజలు, ప్రత్యేక కార్యక్రమాలతో రజకకాలనీ మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో మాట్లాడిన కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ మాట్లాడుతూ, రజక సమాజం సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని ప్రశంసించారు. భవిష్యత్తులో కాలనీ అభివృద్ధికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

పండుగ సందర్భంగా కాలనీ ప్రజలంతా ఐక్యతతో పాల్గొని ఆనందోత్సాహాలతో వేడుకను జరుపుకున్నారు. రజక కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు.ం

# శాంతి భద్రతలకు ఆటంకం కలిగించదు...!

- గిరిజనులకు పలు సూచనలు ఇస్తున్న కొయ్యూరు సీఐ,ఎస్ఐ



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 27:** శాంతి భద్రతలకు ఆటంకం కలిగించవద్దని కొయ్యూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై కిషోర్ వర్మ అన్నారు. మంగళవారం మండలంలోని కొమ్మిక పంచాయితీ తుమ్మల బంధ గ్రామాన్ని సందర్శించి గిరిజనులతో సమావేశమయ్యారు ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు ఎస్సై కిషోర్ వర్మ మాట్లాడుతూ... రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై, మహిళలపై జరుగుతున్న ఆదిత్యాలపై జరుగుతున్న దాడులను, గంజాయి వంటి మత్తు పదార్థాల వైపు యువత దూరంగా ఉండాలని, వాటి వల్ల బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని, వాటి వల్ల వచ్చే అనర్థాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కొమ్మిక సర్పంచ్ సూరిబాబు, వైయస్సార్సీపి నేత సుధాకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శంకర్ ఫౌండేషన్‌కు ప్రతిష్ఠాత్మక ఉత్తమ ఎన్జీవో పురస్కారం



**పెందుర్తి, పెన్ పవర్, జనవరి 27 :** గ్రామీణ ప్రాంతాల్లో కంటి ఆరోగ్య సేవలను విస్తృతంగా అందిస్తూ, అంధత్వ నివారణలో విశేష సేవలందిస్తున్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిష్ఠాత్మక ఉత్తమ (ఎన్జీవో) పురస్కారం లభించింది. అత్యధిక సంఖ్యలో కంటి శస్త్రచికిత్సలు నిర్వహించడంలో, అలాగే గ్రామీణ ప్రజలకు చేరువగా ప్రత్యేక అవుట్‌రీచ్ కార్యక్రమాలు చేపట్టడంలో ఫౌండేషన్ చూపిన అంకితభావాన్ని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. సోమవారం విశాఖపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరందిర్ ప్రసాద్ ఈ పురస్కారాన్ని శంకర్ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ అవార్డును శంకర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ఎ. కృష్ణకుమార్ మరియు డిప్యూటీ జనరల్ మేనేజర్ (పీఆర్ అండ్ లైజన్) కె. బంగారాజు స్వీకరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా కార్యక్రమం ద్వారా అంధత్వాన్ని నివారించడంలో శంకర్ ఫౌండేషన్ చూపుతున్న నిరంతర సేవలు అభినందనీయమని అధికారులు ప్రశంసించారు. నిస్వార్థ సేవా దృక్పథంతో సమాజంపై సానుకూల ప్రభావం చూపుతున్న సంస్థగా శంకర్ ఫౌండేషన్ గుర్తింపు పొందడం గర్వకారణమని తెలిపారు.

ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కమిషనర్ కేతన్ కార్గే ఐఏఎస్, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ ధర్మకర్తల మండలి చైర్మన్ ఎం. రాందాస్, మేనేజింగ్ ట్రస్టీ ఎ. కృష్ణకుమార్, ట్రస్టీలు ప్రొఫెసర్ ఏ. ప్రసన్న కుమార్, విజయ్ కుమార్, వైద్యులు, ఉద్యోగులు, పారామెడికల్ సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. సంస్థ విజయానికి ప్రతి ఒక్కరి అచంచలమైన అంకితభావం, కృషి కారణమని వారు పేర్కొన్నారు. 1997లో స్థాపితమైన శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, నేటివరకు ఐదు లక్షలకు పైగా కంటి శస్త్రచికిత్సలు, 29 లక్షలకు పైగా కంటి పరీక్షలు నిర్వహించి కంటి ఆరోగ్య రంగంలో ఒక కీలక మైలురాయిని అధిగమించిందని తెలిపారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవలు అందిస్తూ, అంధత్వ నిర్మూలన దిశగా ముందుకు సాగుతామని ఫౌండేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# పెందుర్తి జోన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ముగ్గురు సూత్రధారులు!





### బిల్డింగ్ కలెక్షన్ల వెనుక ఔట్‌సోర్సింగ్, ఎంటీఎస్, డ్రైవర్ నెట్‌వర్క్పై తీవ్ర ఆరోపణలు!

**పెందుర్తి, పెన్ పవర్, జనవరి 27 :** స్థానిక పెందుర్తి జోన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో ముగ్గురు ఉద్యోగులు కేంద్రంగా వ్యవస్థాత్మక అవినీతి నడుస్తోందనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. ఎంటీఎస్, ఔట్‌సోర్సింగ్, ప్రైవేట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఈ ముగ్గురు, అధికారికంగా కీలక పదవుల్లో లేకపోయినా, జోన్‌లోని బిల్డింగ్ సెటిల్మెంట్లను నియంత్రిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**డ్రైవర్ డ్యూటీ బిల్డింగ్ సెటిల్మెంట్లు..**

ఈ ముగ్గురిలో ఒకరు అధికారికంగా డ్రైవర్ విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వాస్తవంగా బిల్డింగ్ సెటిల్మెంట్లలో కీలక పాత్ర పోషిస్తున్నాడని సహోద్యోగులు ఆరోపిస్తున్నారు. బిల్డింగ్ కూల్చివేతలకు వెళ్లే సందర్భాల్లో బిల్డర్లతో నేరుగా లావాదేవీలు జరుపుతూ, “సెటిల్మెంట్” పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

**జీతం మెయిన్ ఆఫీసులో పని పెందుర్తి జోన్‌లో..**

వీరి నియామకాలు, జీతాల వ్యవహారం మెయిన్ ఆఫీసుతో సంబంధం ఉన్నప్పటికీ, వాస్తవంగా పెందుర్తి జోన్‌లోనే అన్ని కీలక నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది నిబంధనలకు విరుద్ధమైన వ్యవహారమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఫోన్ పే, బ్యాంక్ లావాదేవీలపై అనుమానాలు..**

డ్రైవర్ త్రినాథ్‌కు సంబంధించిన ఫోన్ పే మరియు బ్యాంక్ ఖాతాలను పరిశీలిస్తే భారీ లావాదేవీలు వెలుగులోకి వస్తాయని తోటి ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. ఫోన్ పే ద్వారా వచ్చిన సొమ్మును ఈ ముగ్గురు సమానంగా పంచుకుంటున్నారన్న విమర్శలు జోన్‌లో బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

**అధికారులపై కూడా ప్రభావమా..**

పట్టణ ప్రణాళిక విభాగానికి కీలకమైన ఏసీబీ డీపీఓలు, జోనల్ కమిషనర్లను కూడా ఈ ముగ్గురు “వీళ్లు చెప్పినట్టు” నడిపిస్తున్నారనే తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. జోన్‌లో మొత్తం ఐదుగురు ఉద్యోగులు ఉంటే, వారిలో ఈ ముగ్గురే ప్రధాన సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారని అంటున్నారు.

ఇతర ఇద్దరు ఉద్యోగులను పక్కన కూర్చోబెట్టడం, గతంలో మెయిన్ ఆఫీసులో పనిచేసి జోన్8 టౌన్ ప్లానింగ్ విభాగానికి ట్రాన్స్ఫర్‌గా వచ్చిన పర్మినెంట్ మున్సిపల్ ఉద్యోగిని కూడా పక్కన పెట్టి, ఈ ముగ్గురితోనే వ్యవహారాలు నడపడం వెనుక పెద్ద ఎత్తున లావాదేవీలు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బిల్డర్లతో సన్నిహిత సంబంధాలు..**

డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి బిల్డర్ భుజంపై చేయి వేసి, అత్యంత చనువుగా మాట్లాడుతున్న ఫోటో ఒకటి బయటకు రావడంతో ఈ ఆరోపణలకు మరింత బలం చేకూరుతోందని ఉద్యోగులు చెబుతున్నారు. ఇది అధికారిక విధులకు, నైతిక ప్రమాణాలకు విరుద్ధమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ మొత్తం వ్యవహారం చూస్తే, పెందుర్తి జోన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి ఒక వ్యక్తిగత చర్య కాదని, వ్యవస్థాత్మకంగా నడుస్తోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫోన్ పే, బ్యాంక్ లావాదేవీలపై సమగ్ర విచారణ చేపడితే నిజాలు బయటకు వస్తాయన్న డిమాండ్ ఉద్యోగ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

# జీవవైవిధ్య పరిరక్షణకు పర్యావరణ విద్య అవసరం

- అంతర్జాతీయ పర్యావరణ విద్యా దినోత్సవాన్ని జయప్రదం చేయండి
- అంతర్జాతీయ స్వచ్ఛ విద్యుత్తు దినోత్సవం జయప్రదం చేయండి
- ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ






**విశాఖ పెన్ పవర్ జనవరి 27**

జీవవైవిధ్య పరిరక్షణకు పర్యావరణ విద్య అవసరం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం మద్దిలపాలెం లోని శ్రీ భావన విద్యా నికేతన్, అక్షర ఇంగ్లీష్ మీడియం విద్యా సంస్థలలో, అంతర్జాతీయ పర్యావరణ విద్యా దినోత్సవాన్ని, అంతర్జాతీయ స్వచ్ఛ విద్యుత్తు దినోత్సవం కార్యక్రమాలను గ్రీన్ సోల్జర్స్ తో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు దినోత్సవాలనూ ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో జనవరి 26న నిర్వహించడం జరుగుతుంది అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి అని కోరారు. వాతావరణ సంక్షోభాన్ని ప్రధానంగా వెలుగులోకి తీసుకువచ్చి, భద్రమైన, మరింత సహనశీలమైన, స్థిరమైన భవిష్యత్తును అందించే పరిష్కారాలపై దృష్టి సారించాలి అని కోరారు. ప్రజలు, భూమి, సమస్త జీవరాశి ప్రయోజనాల కోసం, స్వచ్ఛమైన, సమగ్రమైన పరివర్తన కోసం అవగాహన పెంచడానికి, కార్యాచరణను సమీకరించడానికి కృషి చేయాలని అన్నారు. క్లీన్ ఎనర్జీని స్వీకరించడం ద్వారా శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలని కోరారు. ప్రతి విద్యా సంస్థలో హరిత సైనికులను (గ్రీన్ సోల్జర్స్) ఏర్పాటు చేయడం ద్వారా వారానికి ఒకరోజు రెండు గంటల పాటు పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులు చేత కార్యక్రమాలు నిర్వహించాలని, నెలలో ఒక రోజు పర్యావరణ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో శ్రీ భావన విద్యా నికేతన్ లో నీలిమ, అక్షర ఇంగ్లీష్ మీడియం విద్యా సంస్థలో సునీత, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు మాట్లాడారు .

# శంబర జాతర బందోబస్తు ఏర్పాట్లును స్వయంగా పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి





- 700 మంది పోలీస్ అధికారులతో ప్రణాళికాబద్ధమైన పటిష్ట బందోబస్తు ఏర్పాటు.
- భక్తులతో సంయమనం పాటించండి - విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించండి

**పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్ . పార్వతీపురం మన్యం జిల్లా జనవరి 27:** మక్కువ మండలంలోని శంబర గ్రామంలో వెలసిన ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవత, భక్తుల కోరికలు తీర్చే కల్పవల్లిగా, గిరిజన దేవతగా పేరు గాంచిన శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి జాతర సందర్భంగా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.

ఈనెల 26, 27, 28న మూడు రోజులపాటు అమ్మవారి జాతర సందర్భంగా లక్షలాదిగా భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున పోలీస్ శాఖ కూడా అంచనాలకు తగ్గట్టు సుమారు 700 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో భద్రతాపరమైన చర్యలను చేపట్టి ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

28న సిరిమాను తిరిగే ప్రాంతాలను, ఆలయం పరిసర ప్రాంతాలు, అలాగే క్యు లైన్లు , బారికేడ్స్ ఏర్పాట్లును, పార్కింగ్ స్తలాలు, ట్రాఫిక్ మోనటరింగ్ తదిర ఏర్పాట్లును జిల్లా ఎస్పీ మరియు ఇతర పోలీసు అధికారులు సందర్శించారు. సిరిమాను, పూజారి తరలింపులో ఎటువంటి ఆలస్యం లేకుండా చూడాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో బందోబస్తు నిర్వహించే అధికారులు, సిబ్బంది విధులు గురించి అడిగి తెలుసుకొని పరిశిలించి అధికార్లకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. షిఫ్ట్ డ్యూటీలకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి దర్శనం కోసం ఆలయం వెనుక భాగం నుండి ఎవ్వరినీ, ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించవద్దని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రదానంగా సిరిమాను చూసేందుకు ఆంధ్రప్రదేశ్ మరియు ఓడిస్సా రాష్టాల నుండి బక్తులు వచ్చే ఆస్కారం ఉన్నందున, బక్తులు తాకిడి ఎక్కువ అయ్యే సమయంలో బందోబస్ట్ ను సక్రమంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే సిరిమాను తిరిగే రూట్ మొత్తంను తిరిగి పరిశిలించి ఎటువంటి అవాంచనీయ సంగటనలు జరగకుండా అదేసమయంలో బక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, సిరిమాను జాతరను నడిపించాలని ఆదేశాలు ఇచ్చారు.

# షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం...!



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 27:** మండలంలోని షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు పూరిల్లు దగ్ధమయ్యాయి. బంగారంపేట పంచాయితీ బంగారం పేటలో ఉదయం నాలుగు గంటల సమయంలో కొప్పు సన్యాసిరావు కి చెందిన పురిల్లు దగ్ధమై సర్వం కోల్పోయారు . అలాగే నల్లగొండ పంచాయితీ నల్లగొండ కొత్త వీధి గ్రామానికి చెందిన సంపరి నూక రత్నం ఉపాధి పనుల నిమిత్తం వెళ్ళగా సుమారు ఎనిమిది గంటల సమయంలో పురిల్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలారు . వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

# విద్యారంగంలో కొత్త విప్లవానికి శ్రీకారం

**మధురవాడలో 'ధనిక్ భారత్' విద్యా సంస్థల ఆవిర్భావం**

**బిమిలి, పెన్ పవర్, జనవరి 27 :** భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చి దిద్దాలనే సంకల్పంతో విద్యారంగంలో సరికొత్త మార్పులకు 'ధనిక్ భారత్' విద్యా సంస్థలు శ్రీకారం చుట్టాయి. మధురవాడ కార్ షెడ్ జంక్షన్ పీ.ఎం పాలెం సమీపంలో నూత నంగా ఏర్పాటు చేసిన ఈ విద్యా సంస్థల ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ఈ సందర్భంగా నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంస్థ ప్రతినిధులు వివరాలను వెల్లడించారు. విలువలతో కూడిన విద్యే నిజ మైన సంపద అన్న భావనతో లాయిడ్ గ్రూప్ సీఎండీ, సంస్థ వ్యవస్థాపకులు విక్రం నారాయణరావు దూరదృష్టి, ప్రముఖ సివిల్స్ మెంటర్ బాలలత మల్లవరపు అకాడెమిక్ మార్గదర్శక త్వంలో 'ధనిక్ భారత్' రూపుదిద్దుకుందని తెలిపారు. "ధనిక్ అంటే కేవలం ఆర్థిక సంపద మాత్రమే కాదు. జ్ఞానం, సాంకేతిక ప్రావీణ్యం, నైతిక విలువల సమ్మేళనమే అసలైన సంపద" అని వారు స్పష్టం చేశారు. అనుభవజ్ఞులైన అకాడెమిక్ బోర్డ్ ఈ సంస్థకు బలమైన వెన్ను ముకగా నిలుస్తుందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ విద్యావేత్తలు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు. సంస్థ అకా డెమిక్ బృందంలో 30 ఏళ్ల అనుభవం కలిగిన జోనల్ బ్యాచ్ మోడల్ సృష్టికర్త శ్రీ విక్రం సురేంద్ర బాబు, వేలాది మంది విద్యార్థులను ఐఐటీ, ఎన్ఐటీలకు చేరవేసిన గణిత నిపుణులు పెండే ల మస్తాన్ రావు, ఫిజిక్స్ నిపుణులు, పలు అకా డెమిక్ పుస్తకాల రచయిత కొండముడి రవీంద్ర కుమార్, ఏఐడేటా ఆధారిత అకాడెమిక్ అడ్మి నిస్ట్రేటర్ ఏ. గిరిబాబు ఉన్నారు. అలాగే ఐఐటీ ఢిల్లీ పూర్వ విద్యార్థి, టాప్ ర్యాంకుల సృష్టికర్త అంచా రాంబాబు, విద్యా పరిపాలనలో నిపుణు లు కె. సాంబశివ రావు, లైఫ్ స్కిల్స్‌వ్యక్తిత్వ వికాస నిపుణులు డా. సలీం సంస్థకు సేవలందిం చనున్నారు. ఇంటర్మీడియట్‌తో పాటు ఐఐటీజేఈఈ, నీట్, యూపీఎస్సీ, పునాది తరగ తుల నిర్వహణను చేపట్టనున్నట్లు తెలిపారు. కంఠస్థం చేసే పాత విధానాలకు స్వస్తి పలికి, విశ్లేషణాత్మక




ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. తక్కువ విద్యార్థిఉపాధ్యాయ నిష్పత్తితో ప్రతి విద్యార్థికి వ్యక్తిగత మెంటార్షిప్ అందించ డంతో పాటు, మారుతున్న సాంకేతికత, ఏఐ ఆధారిత ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 202627 వి ద్యా సంవత్సరం నుంచి కార్యకలాపాలు ప్రారం భం కానున్నాయని, తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీ డియట్ విద్యకు కొత్త దిశానిర్దేశం చేయడమే తమ లక్ష్యమని సంస్థ డైరెక్టర్ బాలలత మల్లవ రపు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అజయ్ తో పాటు ఇతర డైరెక్టర్లు పాల్గొన్నారు.




## రైతులు పశువులకు భీమా చేయించండి...!

- పశు వైద్యాధికారి రాజేష్ రైతులకు సూచన



**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 27 :** మండలంలోని కొండగోకిరి పంచాయతీలో మండల పశువైద్యాధికారి డాక్టర్ కే రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. మంగళవారం ఈ ఆరోగ్య శిబిరాలలో సంతానలేమి సమస్య ఉన్న పశువులను పరీక్ష చేసి చికిత్స అందించారు. మొత్తంగా 220 పెద్ద పశువులు,80 దూడలు 210గొర్రెలు మేకలకు నులిపురుగు మందులు పట్టించి,182 కోళ్లకు టీకాలు వేశామన్నారు . అలాగే 15 పశువు లకు చెవి పోగులు వేసి పశు బీమా (ఇన్సూరెన్స్) చేశారు. కార్యక్రమం అనంతరం డాక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ... ఈ ఇన్సూరెన్స్ మూడు సంవత్సరాల వరకు వర్తిస్తుందని ఈలోపు పశువు ఏదైనా కారణం చేత మరణించినట్లయితే భీమా తాలూకా అమౌంట్ నేరుగా రైతు ఖాతాలో జమ చేయబడుతుందని, భీమా వర్తించాలంటే చెవిపోగు తప్పనిసరి ఉండాలి అని, ఏదైనా కారణం చేత చెవిపోగు పడిపోయినట్లయితే దగ్గర్లోని పశు వైద్యాలయం లో గాని సచివాలయ పశుసంవర్ధక సహాయకునికి గాని తెలియ చేయాలని కోరారు . ఇన్సూరెన్స్ చేయించుకోవడానికి ఈనెల 31 వ తేదీ చివరి రోజు అని, ఈ లోగా రైతుల తమ పశువులకు పశుబీమా ( ఇన్సూరెన్స్ ) చేయించుకోవాలని తెలిపారు. 50% రాయితీ తో పశు వుల దాణా కూడా అందుబాటులో ఉందని ఆసక్తిగల రైతులు దగ్గరలోని సచివాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగటి ముసలి నాయుడు, టిడిపి మహిళా అధ్యక్షురాలు, ఏలూరు రత్నం, పెస కమిటీ సెక్రటరీ మడకం గోపి, రైతులు, గ్రామ పెద్దలు,పశుసంవర్ధక సహాయకుడు నగేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అద్దరవీదిలో మెగా పశువైద్య శిబిరం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 26:** ప్రభుత్వ ప్రత్యేక ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 19 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక పశు ఆరోగ్య శిబిరాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం (27-1-2026) గూడెం కొత్త వీధి మండలం అద్దరవీది గ్రామంలో మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు, 112 కోళ్లకు రానికెట్ వ్యాధి టీకాలు, 163 మేకలకు గోట్‌పాక్స్, 98 గొర్రెలకు షీప్‌పాక్స్ ముందస్తు టీకాలు వేశారు. అలాగే అన్ని పశు వులకు పాముల మందు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఆరు పశువులకు రూ.30,000 విలువైన బీమా సౌకర్యాన్ని కేవలం రూ.298 (15 శాతం రైతు వాటా, 85 శాతం ప్రభుత్వ సబ్సిడీతో) మూడేళ్ల కాలానికి కల్పించారు. అలాగే మేకలు, గొర్రెలకు ఒక్కొక్కటికి రూ.27 మాత్రమే చెల్లించి రూ.2,000 విలువైన ఒక సంవత్సరం బీమా సౌకర్యాన్ని 18 మేకలు, గొర్రెలకు అందజేశారు. పశువుల కోసం పశుగ్రశాలలను100 శాతం సబ్సిడీతో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా నిర్మించుకోవచ్చని పశువైద్యాధికారి లోకుల రమేష్ తెలిపారు. రైతులందరూ ఈ పశువైద్య శిబిరాలు, బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పసుపులేటి నాగమణి,రీమల రాజేశ్వరి,ఉప సర్పంచ్ రాంబాబు, బీజేపీ నాయకులు కాకూరి శేఖర్, రాంకిరణ్‌తో పాటు మండలంలోని పశు వైద్య సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ క్రీడా రంగానికి కొత్త ఊపిరి





- అత్యాధునిక సౌకర్యాలతో స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పునఃప్రారంభం
- రూ.16.90 కోట్లతో పునరాభివృద్ధి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 27 :** జీవీఎంసీ నార్త్ జోన్ పరిధిలోని 24వ వార్డులో ఉన్న స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియాన్ని అత్యా ధునిక సౌకర్యాలతో పునరాభివృద్ధి చేసి ప్రజల కు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు విశాఖ పట్నం పార్లమెంటు సభ్యులు ఎం. భరత్ తెలిపారు. మంగళవారం గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ నిధులతో రూ.16.90 కోట్ల వ్యయంతో పునరుద్ధరించిన స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియాన్ని నగర మేయర్ పీలా శ్రీని వాసరావు, ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యు లు పి.విష్ణు కుమార్ రాజు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌లతో కలిసి ఎంపీ ఎం.భరత్ ఘనంగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎం. భరత్ మాట్లాడుతూ, స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అను గుణంగా ఆధునికీకరించి ప్రజలకు అందుబాటు లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. స్టేడియంలో 6 బ్యాడ్మింటన్ కోర్టులు, జీఐ షీట్ రూఫింగ్, చెక్కతో నిర్మించిన స్పోర్ట్స్ ఫ్లోరింగ్, ఎపోక్సీ ఫ్లోరింగ్, అకౌస్టిక్ వాల్ క్లాడింగ్, గ్లాస్ ప్యానెలిం గ్, ఏసీపీ క్లాడింగ్, ఫాల్స్ సీలింగ్ వంటి ఆధునిక ఏర్పాట్లు చేశామని వివరించారు. అలాగే 1750 మంది ప్రేక్షకులు కూర్చునేలా ఫోల్డింగ్ కుర్చీలు, స్టేడియం చుట్టూ బిటి రోడ్డు, లైన్ మార్కింగ్ పె యింటింగ్, లైటింగ్, ఎయిర్ కండిషనింగ్, స్పో ర్ట్స్ హాల్ లైటింగ్, అగ్నిమాపక భద్రతా ఏర్పా ట్లు, సీసీటీవీ నిఘా వంటి సౌకర్యాలు కల్పించా మని చెప్పారు. ప్రజలకు సులభంగా వినియోగిం చేలా ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని కూడా ఏర్పా టు చేస్తున్నట్లు తెలిపారు. విశాఖ నగరం నుంచి అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీ య స్థాయిలో ప్రతిభ చూపి నగరానికి కీర్తి తె చ్చారని పేర్కొన్న ఎంపీ, స్టేడియాన్ని సమర్థవం తంగా నిర్వహిస్తూ క్రీడల ద్వారా ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్‌కు సూచించారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్య త ఇస్తోందని అన్నారు. పునరాభివృద్ధి చేసిన స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం ద్వారా పేదలకూ క్రీడల్లో పాల్గొనే అవకాశాలు విస్తరించాయని పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యు లు పి.విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ, స్మార్ట్ సిటీ నిధులతో రూ.16.90 కోట్లతో స్టేడియాన్ని ఆధునికీకరించడం శుభపరిణామమని అన్నా రు. స్లాట్ బుకింగ్ ద్వారా స్టేడియాన్ని వినియో గించుకునే అవకాశాలు కల్పించాలని, జాతీయఅంతర్జాతీయ టోర్నమెంట్లకు అద్దెకు ఇస్తే ఆదాయం కూడా లభిస్తుందని సూచిం చారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజారోగ్యానికి క్రీడలు ఎంతో అవసరమని, అందుకు అనుగుణంగా స్టేడి యాన్ని పునర్నిర్మించామని తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ప్రజలకు స్టేడియాన్ని అందుబా టులో ఉంచనున్నట్లు చెప్పారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియాన్ని జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు అనుకూలంగా, ప్రజలకు ఉపయోగపడే విధంగా స్మార్ట్ సిటీ నిధులతో తీర్చిదిద్ది వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. స్టేడియం ప్రారంభోత్సవం అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్పొరేటర్లు షటిల్ బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, పెద్దింటి ఉషాశ్రీ, మొక్క శ్రావణి, కందుల నాగ రాజు, ఆళ్ల లీలావతి, పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన ఇంజనీర్ పీవీ సత్యనారాయణ రాజు, కార్యనిర్వాహక ఇంజనీర్లు గంగాధర్, శాంతి రాజ్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు శ్రీనివాస్, అన్నమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# డోలి మోతలో గర్భిణిని తరలింపు



**రహదారి సౌకర్యం కల్పించాలంటూ గ్రామస్తుల ఆవేదన**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 27:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జర్రెల పంచాయితీ పరిధిలోని పెద్దూరు గొంది గ్రామానికి చెందిన పూజారి గిరిబాబు భార్య లక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆమెను సుమారు ఐదు కిలోమీటర్ల దూరం డోలి మోతలో తీసుకెళ్లి, కొంద్రుపల్లి గ్రామం చేరుకున్న అనంతరం అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. గ్రామం నుంచి ప్రధాన రహదారి వరకు రాకపోకల సౌకర్యం లేకపోవడంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోయారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, రోగులను డోలి మోతల్లో తరలించాల్సిన దుస్థితి నెలకొనడం తమను తీవ్రంగా బాధిస్తోందని తెలిపారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెద్దూరు గొంది గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.

## మా మండల సమస్యలు నెరవేర్చేలా చూడండి...!

- ఎస్టీ కమిషన్ చైర్మన్ ని కలిసిన బిజెపి నేతలు




**కొయ్యూరు, పెన్ పవర్ జనవరి 27 :** మండలంలో నెలకొన్న సమస్యలను నెరవేచ్చేలా చూడండి అని ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి నీమర్యాదపూర్వకంగా కలిసిన బిజెపి నేతలు. మంగళవారం విజయవాడలో బొజ్జి రెడ్డిని కలిసి మండలంలో ఉన్న మౌలిక సమస్యలపై ఆయనకు వివరించారు ముఖ్యంగా రోడ్లు, మంచినీటి సదుపాయం, పీఎం జన్మన్ గృహాలు అలాగే పెండింగ్ లో ఉన్నటువంటి అనేక సమస్యలపై ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అన్ని శాఖల అధికారులతో మాట్లాడి సమస్య లు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు మండల బిజెపి నేతలు రీమల చందర్రావు, అరిమెల రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

## శంబర పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్.



**గుమ్మలక్ష్మీపురం జనవరి 27 పెన్ పవర్.** సాలూరు నియోజకవర్గం మక్కువ మండలంలోని శంబర గ్రామంలో వెలసిన గిరిజనుల కొంగుబంగారం,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ శంబర పోలమాంబ అమ్మవారిని మంగళవారం నాడు ప్రభుత్వ విప్ & కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల కూటమి నాయకులతో కలిసి అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మన్నారు తోటపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుండి తీసుకువచ్చిన సారెను ఎమ్మెల్యే శంబర పోలమాంబ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించి అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో,సమృద్ధిగా ఉండాలని ఎమ్మెల్యే. ప్రార్థించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు,పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## విశాఖ ఉత్సవాలకు రంగులు అద్దనున్న పుష్ప ప్రదర్శన

- ఏర్పాట్లపై చైర్మన్ ప్రణవ్ గోపాల్ సమీక్ష





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 27 :**విశాఖ ఉత్సవాల్లో భాగంగా వీఎంఆర్డీఏ సెంట్రల్ పార్క్‌లో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక పుష్ప ప్రదర్శన ఏర్పాట్లను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కే. రమే ష్, చీఫ్ ఇంజనీర్ వినయ్ కుమార్, సీఏవో హరి ప్రసాద్, ఇన్‌చార్జి జిల్లా అటవీ అధికారి వరుణ్ కార్తీక్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొ న్నారు.పుష్ప ప్రదర్శన ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం చైర్మన్ గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న విశాఖ ఉత్సవాల్లో ఈ పుష్ప ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని నిర్వాహకులకు స్పష్టమైన సూచనలు చేశారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనను పెద్ద సంఖ్య లో ప్రజలు సందర్శించే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు.

బెంగళూరు, కలకత్తా తదితర రాష్ట్రాల నుంచి ప్రత్యేకంగా తెప్పించిన అరుదైన పుష్పాలు, ఆక ర్షణీయమైన పుష్పాల అలంకరణలు, అం శాల ఆధారిత పుష్ప రూపకల్పనలను చైర్మన్ గారు పరిశీలించారు. పుష్పాల అమరికలో నాణ్యత, కొత్తదనం స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు. సందర్శ కుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, రద్దీ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యాలు, త్రాగునీ టి వసతి, మరుగుదొడ్లు, అగ్నిమాపక భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్నారులు, మహి ళలు, వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

అలాగే పుష్ప ప్రదర్శనకు "స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర" అనే అంశాన్ని ఎంచుకొని, పర్యావర ణ పరిరక్షణ, శుభ్రత, హరిత అభివృద్ధి వంటి సందేశాలు ప్రజల్లోకి బలంగా వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పుష్ప ప్రదర్శన విశాఖ నగర ప్రతిష్టను మరింత పెంచేలా ఉండా లని చైర్మన్ తెలిపారు.

విశాఖ ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పుష్ప ప్రదర్శన ప్రజలకు ఆహ్లాదకరమైన అను భూతిని అందించడమే కాకుండా, పర్యాటకు లను ఆకర్షించే విధంగా ఉండాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ స్పష్టం చేశారు.

## ఏకలవ్య సంఘటన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు.




**గుమ్మలక్ష్మీపురం జనవరి 27 పెన్ పవర్.**కురుపాం ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో గిరిజన విద్యార్థిని గర్భం దాల్చిన వైనం పట్ల కురుపాం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ఆగ్రహం వ్యక్తం చేశారు మంగళవారం గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక విలేకరులతో మాట్లాడారు.పై ఘటనపై మాట్లాడుతూ.గతంలో ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ తీరుపై అనేక ఆరోపణలు రావడం,గత విద్యాసంవత్సరంలో విద్యార్థినులను పీఈటీ దారుణంగా కొట్టిన విషయం,మరో సందర్భంలోనూ ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడడం వెరసి ప్రక్కనే గల"బాలికల గురుకులం"లో ఇరువురు పదవ తరగతి విద్యార్థినుల మరణాలు వంటి ఘటనలు బాధిత గిరిజన విద్యార్థినులు,మరి ముఖ్యంగా ప్రతిసారీ గుండె కోతకు గురవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు మదిలో తుడుపు పెట్టగా మునుపే అదే కోవకు చెందిన ఘటనగా మరో గిరిజన విద్యార్థిని పాఠశాలలోనే ఉంటూ తాజాగా గర్భం దాల్చుడంతో మరింత కలకలంనకు గురవుతున్నారన్నారు.పాఠశాలలో ప్రిన్సిపాల్,వైస్ ప్రిన్సిపాల్,వార్డెన్లు,ఏ ఎన్ ఎంలు.ఇలా ఇంతమంది సిబ్బంది ఉన్నా విద్యార్థిని గర్భం దాల్చి నెలలు కావస్తున్నా సమస్యను గుర్తించడంలో బాధ్యతగల ఉద్యోగులు పర్యవేక్షణ లోపం వెరసి బాధ్యతారాహిత్యం కొట్టోచ్చినట్లు కనబడుతుందని మండిపడ్డారు.తరచూ ఎదురవుతున్న భయంకర సంబవాలతో విద్యార్థుల తల్లిదండ్రులు సరి కదా! ఏకలవ్య పాఠశాలల్లో ప్రిన్సిపాల్ మొదలుకొని బోధన,బోధనేతర సిబ్బంది వరకు ఇక్కడి మాతృభాష తెలుగు రానివారై ఉండడం,ఉపాధ్యాయులుగా వీరు చెప్పే పాఠ్యాంశాలు విద్యార్థులకు అర్థం కాక,గురుకులాలుగా పిలువబడుతున్న ఈ ఏకలవ్య పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులు మధ్య విధేయతతో కూడుకొన్న స్నేహపూర్వక వాతావరణం కొరవడుతోందని,ఈ పరిస్థితి జిల్లాలో గల ఏకలవ్య పాఠశాలలన్నింటిలోనూ వెంటాడుతుందని. వీటన్నింటినీ పరిశీలనాత్మకంగా దృష్టించి జిల్లా కలెక్టర్ మరియు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ తక్షణమే పై చర్యలకు ఉపక్రమించి, లోపభూయిష్టమైన ఏకలవ్య పాఠశాలలు నిర్వహణ సరి చేయడమే గాక,ప్రస్తుతం విద్యార్థిని గర్భం దాల్చిన ఘటనకు బాధ్యులైన ఉద్యోగులపై కఠినమైన చర్యలు చేపట్టాలని చిన్నారావు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కురుపాం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల ఫ్రాన్సిస్,గుమ్మలక్ష్మీపురం మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోలక జయరాం,పార్టీ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి పాలక సంపత్ కుమార్,బిడ్డిక శ్రీధర్ పాల్గొన్నారు.

# కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫేర్వెల్ మీటింగ్....





**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,జనవరి 27 :**పారిశ్రామిక ప్రాంతం గాజువాక నియోజకవర్గం 87వ వార్డు పరిధి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫేర్వెల్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యంగా అతితులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాధం జగన్ పాల్గొని ఈ సందర్భంగా ముఖ్య అతిదులు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుతున్న పదోవ తరగతి విద్యార్థుల మరో నెల రోజుల్లో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు శ్రద్దగా చదివి ఆందోళన ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని చెడువేశ్నాలకు బానిస కాకుండా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని అన్నారు.ఈ కార్యక్రమం లో వార్డ్ అధ్యక్షులు విజయరామరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజు, డీవీ అప్పారావు,భాగ్య లక్ష్మి, కడుపుట్ల శ్రీను, కళ్యాణ్ చక్రవర్తి, ఏటీఎన్ మూర్తి, దాలయ్య, సుందర్ సునీల్, హై స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా ఆస్తుల కబ్జాకు కుట్ర



గీతం భూముల వ్యవహారంపై వైఎస్సార్‌సీపీ భేటీ

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 27 :**సుమారు రూ.5 వేల కోట్ల విలువైన 54.79 ఎకరాల ప్రభుత్వ భూమిని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులకు సంబంధించిన గీతం విద్యా సంస్థకు రెగ్యులైజేషన్ చేయాలనే ప్రయత్నాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ నెల 30న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో దీనిని అజెం డాగా పెట్టి తీర్మానం చేసి, ప్రభుత్వానికి పంపి రెగ్యులైజేషన్ చేయాలన్న కుట్ర జరుగుతోందని పార్టీ నాయకులు ఆరోపించారు.ఈ అంశంపై వైఎస్సార్‌సీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె. రాజు ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని మేఘాలయ హోటల్‌లో జీవీఎంసీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. ప్రజా ఆస్తులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఈ సమావేశంలో స్పష్టంగా ప్రకటించారు.

ఈ సమావేశంలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ గారు మాట్లాడుతూ, కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రాజకీయ ఒత్తిళ్లతో రెగ్యులైజేషన్ చేయడం ప్రజాస్వామ్యా నికి విరుద్ధమని అన్నారు. ఇటువంటి నిర్ణయాల పై ప్రజల్లోకి వెళ్లి ఉద్యమం చేపడతామని హెచ్చ రించారు.

సమావేశంలో రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు , మాజీ మంత్రి గుడివాడ అమర్నా థ్ , విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, శాసనమండలి సభ్యులు కుంబా రవిబాబు , పండుల రవీంద్రబాబు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

అలాగే సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్ కుమార్ , కరణం ధర్మశ్రీ అన్నంరెడ్డి అదీప్ రాజ్ , తిప్పల దేవన్ రెడ్డి , మొల్లి అప్పారావు , మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతల పూడి వెంకటరామయ్య , అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేటి ప్రసాద్ , మాజీ మేయర్ హరివెంకట కుమారి , డిప్యూటీ మేయర్ కటు మూరి సతీష్ , మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ , ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస రావు , కార్పొరేటర్లు, ముఖ్య నాయకు లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం అవసరమై తే న్యాయపరమైన పోరాటంతో పాటు ప్రజా ఉద్యమం చేపడతామని సమావేశంలో తీర్మానించారు.

## కమ్మసిగడాం మహాలక్ష్మి అమ్మవారి జాతరకు పటిష్ఠ బందోబస్తు.



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ శ్రీకాకుళం జనవరి 27:** రణస్థలం మండలం కమ్మసిగడాం గ్రామంలో నేటి నుంచి మూడు రోజుల పాటుగా నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా, సురక్షితంగా ఉత్సవాలు నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.వి. రమణ పోలీసు అధికారులు, సిబ్బందికి విధి నిర్వహణపై మంగళవారం ప్రత్యేక చూచనలు ఇచ్చారు. భక్తుల రాకపోకలను సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, పార్కింగ్ ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించడం, మహిళలు, వృద్ధులు, దివ్యాంగ భక్తులకు ప్రత్యేక సహకారం అందించడం, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అలాగే, భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, భద్రతా నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

## చెరువూరుకోరుకొండ మధ్య వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన

- రూ.1.90 లక్షల నిధులు
- బలపం సర్పంచ్ రమేష్ నాయుడు.

**చింతపల్లి,పెన్ పవర్ , జనవరి 27:-:** చింతపల్లి మండలంబలపం పంచాయతీ చెరువూరుకోరుకొండ గ్రామాల మధ్య రాకపోకలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కీలక ముందడుగు పడింది. గిరిజన సంక్షేమ శాఖ మంజూరు చేసిన రూ.1.90 లక్షల నిధులతో నూతన వంతెనల నిర్మాణానికి మంగళవారం ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. చెరువూరు దిగజనభ నుంచి కోరుకొండ బూరుగుబయలు గ్రామాల మధ్య ప్రవహించే కాల్వ పై నిర్మించనున్న ఈ వంతెనలకు కోరుకొండ సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలో చెరువూరు, కోరుకొండతో పాటు పరిసర గ్రామాల వద్ద కాలువలు ఉధృతంగా పొంగిపొర్లి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతుండటంతో విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గ్రామస్తుల దీర్ఘకాలిక డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. రెండు వంతెనలను రూ.95 లక్షల చొప్పున వ్యయంతో నిర్మించనుండగా, పనులు పూర్తయితే వర్షాకాలంలోనూ గ్రామాల మధ్య సురక్షిత ప్రయాణానికి మార్గం సుగమమవుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ



కార్యక్రమంలో వైకాపా నాయకులు బచ్చలి బాబురావు, కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కృష్ణ, లింగరాజు, లింగరావు, లక్ష్మి, సోమరాజు, కూటమి నాయకులు అప్పారావు, చిట్టీబాబు, నారాయణరావు, వీరయ్య దొర, గ్రామ పెద్దలు మత్యలింగం, నాగేశ్వరరావు, చిట్టీబాబు, రామారావు, చిన్నబ్బాయి, బాబురావు, బాలకృష్ణ, లక్ష్మణ్, లోత పరమేష్, పండమ్మ వండలం, చంటిబాబు, శ్రీనివాస్, నానాజీ తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

## పద్మనాభం మండలంలో 18వ విడత సామాజిక తనిఖీలు విజయవంతం




రూ.17 కోట్ల పనులపై సోషల్ ఆడిట్ పూర్తి కేవలం రూ.18,900 రికవరీ

**పద్మనాభం, పెన్ పవర్, జనవరి 27 :**విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలంలో 18వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా మం డల ఆవరణలో సోషల్ ఆడిట్ పబ్లిక్ హియ రింగ్‌ను ఎంపీడీవో వి. నాగేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకు అమలైన పథ కాలకు సంబంధించిన పనులపై విస్తృతంగా ఆడిట్ నిర్వహించారు. ఇందులో వేజ్ కాంపనెం ట్‌గా రూ.13 కోట్లు, మెటీరియల్ కాంపనెంట్‌గా రూ.4 కోట్లు కలిపి మొత్తం రూ.17 కోట్ల విలువై న పనులను సామాజిక తనిఖీకి లోబర్చారు.

ఆడిట్‌లో భాగంగా చెరువులు, కాలువలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, పంచాయతీ భవనాలు, సచి వాలయ భవనాల పనులను క్షేత్రస్థాయిలో పరి శీలించారు. మస్టర్లలో జరిగిన దిద్దుబాట్లు, కొట్టి వేసిన వేతనాల కారణంగా రూ.18,900 రికవ రీగా నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

మిగిలిన అన్ని పనులు నిబంధనల ప్రకారం సక్ర మంగా జరిగాయని ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమాదేవి తెలిపారు.

ఈ సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఎస్ఆర్పీ సిహెచ్. రామచంద్రరావు, ఏపీవోలు సత్యగౌరి, వరలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ డైరెక్టర్ మొట్టడం శరబన్న దొరకు పరామర్శ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 27:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం రింతాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు చింతపల్లి ఏఎంసి డైరెక్టర్ మొట్టడం శరబన్న దొరకు ప్రమాదవసత్తు చేతికి గాయం కావటంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం గ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకొన్న జనసేన పార్టీ నాయకులు గొర్లె వీర వెంకట్ రింతాడలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఏఎంసి డైరెక్టర్ ను పరమర్శించిన వారిలో పిసా మండల ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు, పాత్రికేయులు గబులంగి హనుమంత రావు, సాగిన లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

## గిరిజన సంస్కృతి ఆచారాలకు ప్రతీకగా రాజులబాబు పండగ

- గ్రామాల్లో ప్రారంభమైన రాజులబాబు పండగ





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్ జనవరి 27:**గూడెం కొత్తవీధి మండలంలోని ఆదివాసి గిరిజన రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం కొండకోనల్లో సంచరిస్తూ అడవులనే ఆధారంగా జీవనం కొనసాగిస్తున్నారు. అటువంటి సందర్భాల్లో అడవుల్లో సంభవించే ప్రాణాపాయ ప్రమాదాలు, దురదృష్ట సంఘటనలు ఎదురుకాకుండా తమను రక్షించాలని కోరుతూ 'రాజులబాబులు'గా పిలవబడే గ్రామ దేవతలను గిరిజనులు భక్తిశ్రద్ధలతో కొలుస్తుంటారు.ప్రతి ఏటా సంక్రాంతి పండుగ ముగిసిన అనంతరం, రథసప్తమి తరువాత ఈ సంప్రదాయ పండుగను గ్రామాల్లో నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. గ్రామ దేవతలైన రాజులబాబులకు మొక్కులు చెల్లిస్తూ, గ్రామస్తులంతా కలిసి చెట్ల కొమ్మల కింద వంటావార్పు చేసి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం పరిసర గ్రామాల ప్రజలను ఆహ్వానించి ప్రసాదం పంపిణీ చేయడం ఈ పండుగ ప్రత్యేకత.ఈ పండుగ ద్వారా గిరిజనులు తమ సాంప్రదాయాలను, సంస్కృతిని తరతరాలకు అందిస్తూ వస్తున్నారు. రాజులబాబు పండుగ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా, గిరిజనుల ఆచారాలు, విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది.ఈ ఏడాది గూడెం కొత్తవీధి మండలంలోని గూడెం పాతవీధి గ్రామంలో రాజులబాబు పండుగ ఘనంగా ప్రారంభమైంది.నూతులు, దేరాల,ఏబులం మండలంలోని పలు గ్రామాల్లో ఈ పండుగ శోభ సంతరించుకోవడంతో గ్రామీణ వాతావరణం ఉత్సాహభరితంగా మారింది.

# 28న మహాధర్నా అరకు ఉత్సవాల ముట్టడి



ప్రభుత్వాన్ని హెచ్చరించిన సత్యనారాయణ

**చింతపల్లి పెన్ పవర్ జనవరి27:-** 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు ఉద్యోగ నియామకాల్లో 100 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తక్షణమే చట్టం చేయాలని, ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఆదివాసీ నిరుద్యోగ సంఘం జిల్లా కన్వీనర్ సాగిన సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివాసీ నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28వ తేదీన మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ధర్నాకు ఆదివాసీ నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులు మరియు ప్రజాసంఘాల నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో ఆదివాసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఈ నిర్లక్ష్యం కారణంగానే గత మెగా డీఎస్సీలో సుమారు 5 వేల మంది ఆదివాసీ అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న కొత్త నోటిఫికేషన్ విడుదల కాకముందే, ఏజెన్సీ ప్రాంత నిరుద్యోగులకు న్యాయం జరిగేలా 100 శాతం ఉద్యోగ నియామక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏల పరిధిలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, కేవలం ఆదివాసీ అభ్యర్థులతోనే నియామకాలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 29న అరకులో జరగనున్న ఉత్సవాల వేదికగా ముఖ్యమంత్రి దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో అరకు ఉత్సవాలను అడ్డుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నిరుద్యోగ సంఘం జిల్లా కో-కన్వీనర్ దేపురం రాజుతో పాటు నాయకులు రాము, సురేష్, మత్యరాజు తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## స్వాతంత్ర సమరయోధుల చేతిలో మద్యం బాటిల్ పై వైసీపీ నిరసన

**కంబాల చెరువు, దండి మార్చ్ విగ్రహాల వద్ద మాజీ ఎంపీ భరత్ బైఠాయింపు**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 27**
స్వాతంత్ర సమరయోధుల చేతిలో మద్యం బాటిల్ పెట్టడంపై నగర వైసీపీ నేతలు నిరసన మంగళవారం నిరసన వ్యక్తం చేశారు.స్థానిక కంబాల చెరువు, దండి మార్చ్ స్వాతంత్ర సమరయోధుల విగ్రహాల వద్ద వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి రాజమండ్రి మాజీ ఎంపీ మార్గాని భరత్ బైఠాయించారు.
గణతంత్ర దినోత్సవం నాడు మహనీయుడు డాక్టర్ అంబేద్కర్ ని విస్మరించిన ప్రభుత్వం, మంగళవారం కంబాల చెరువు, దండి మార్చ్ స్వాతంత్ర సమరయోధుల చేతిలో మద్యం బాటిల్ పెట్టిన ఘటన, ఇదీ కూటమి ప్రభుత్వం, యంత్రాంగం నిర్వాకమన్నారు. తూర్పు గోదావరి జిల్లా హెడ్ క్వార్టర్స్ నగరంలో మద్యం ఏరులై పారుతుందన్నారు మహనీయుల చేతిలో మద్యం సీసాను పెట్టీ దేశ కీర్తిని అగౌరవ పరుస్తుంటే యంత్రాంగంచోద్యం చూస్తున్నదన్నారు. కనీసం ఆ మహనీయుల చేతిలో ఉన్న మద్యం సీసాను తొలగించ లేదన్నారు.
జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఆరుగురు ప్రజాప్రతినిధులు ఇక్కడ ఉన్నా ఈ తరహా అసాంఘిక కార్యక్రమాలు చేస్తున్నా పట్టించుకోకవడం సిగ్గు చేటన్నారు.సి సి ఫుటేజ్ ద్వారా నిందితున్ని పట్టుకోవాలని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని, లేని పక్షంలో నిరసన ఉధృతం చేస్తామని భరత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రేణులు పాల్గొన్నారు

## శతవర్ష జగన్నాథంకు అలనాటి శిష్యుని అభివందనం




**పెన్ పవర్, ఉంగుటూరు, జనవరి 27 :**కైకరం వాసి, ప్రసిద్ధ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, సాహితీవేత్త జటావల్లభుల జగన్నాథం మాస్టారిని ఆయన వద్ద మూడున్నర దశాబ్దాల క్రితం విద్యనభ్యసించిన అలనాటి శిష్యుడు, ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డ కైకరం వాసి సనపల రామకృష్ణ మంగళవారం కలసి అభివందనం చేశారు.
స్వగ్రామం కైకరం వచ్చిన రామకృష్ణ గత రెండు రోజులుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తన గురువైన జగన్నాథం మాస్టారితో పలు విద్యా, ఆధ్యాత్మిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గురుశిష్యుల మధ్య సాగిన ఈ ఆత్మీయ భేటీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన సంస్కృత పండితురాలు శ్రీపూర్ణ కామాక్షీ నూకల గురుశిష్య అనుబంధ ప్రాధాన్యతను వివరిస్తూ సోదాహరణంగా సంస్కృత ఉపన్యాసం చేశారు. ఆమె ప్రసంగం సభికులను విశేషంగా ఆకట్టుకుంది.
ఈ కార్యక్రమంలో కూన అప్పారావు, సత్సంగ వ్యవస్థాపకుడు కొచ్చర్లకోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్నాథం మాస్టారిని రామకృష్ణ, ఆయన సోదరుడు నీలాంబర రావు నూతన వస్త్రాలతో సత్కరించారు. అనంతరం సంస్కృత పండితురాలు పూర్ణిమ కామాక్షిని కూడా ఘనంగా సత్కరించారు.

## మంత్రి లోకేష్ యువ గళం పాదయాత్రకు మూడేళ్లు.

శాప్ డైరెక్టర్ జగదీశ్వరి.



**గోపాలపురం/పోలవరం, పెన్ పవర్, జనవరి 27.**రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు చేసిన యువ గళం పాదయాత్ర చేసి నేటికీ మూడేళ్లు పూర్తయిందని రాష్ట్ర క్రీడా ప్రాధికారిత సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. లోకేష్ పాదయాత్ర చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమె స్థానిక క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.అప్పటి ప్రభుత్వ అరాచక పాలనను అంతమొందించాలని ప్రజలకు మంచి పాలన అందించాలని సదుద్దేశంతో లోకేష్ అప్పట్లో యువ గళం పేరిట పాదయాత్ర నిర్వహించారన్నారు. పాదయాత్ర ఆది నుండి అంతం వరకు తాను తన భర్త రాష్ట్ర టిడిపి ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు విజయ నాయక్ ను లోకేష్ తోనే గడిపామని ఆ యాత్రకు సంబంధించిన సన్నివేశాలను కొద్దిసేపు ముచ్చటించారు.226 రోజులు సుదీర్ఘంగాసాగిన ఈ పాదయాత్ర ఆంధ్ర ప్రజల తలరాతలను మార్చి వేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనే వారిని వాటిని చూసి చలించిన లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను ప్రత్యక్షంగా వీక్షించారన్నారు. ఆయన ఎన్నో ప్రయాసలకు ఓర్చి రేయం భవళ్ళు చేసిన పాదయాత్ర చరిత్రలో మిగిలిపోయింది అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిస్వార్థంతో లోకేష్ పాదయాత్ర చేయడం అభినందనీయం అన్నారు. రైతుల కన్నీళ్ళకు భరోసా ఇస్తూ, మహిళలలో ధైర్యాన్ని నింపుతూ, యువతకు ఆదర్శంగా ఉంటూ ఆనాడు పాదయాత్ర చేశారన్నారు. ఆ యాత్ర రాష్ట్ర ప్రజల హృదయాల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు. తరువాత జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ భారీ విజయానికి దారితీసిందని అన్నారు. యువ మంత్రి లోకేష్ సారథ్యంలో రాష్ట్రం దినదిన అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇంకా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలకాలన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా లోకేష్ వేస్తున్న అడుగులకు అన్ని వర్గాల నుండి ఆదరణ లభించాలని జగదీశ్వరి ఈ సందర్భంగా కోరారు.

## పోస్ట్ ఆఫీసుకు బాదంపూడి విద్యార్థుల క్షేత్ర పర్యటన




**పెన్ పవర్, ఉంగుటూరు, జనవరి 27:**
ఉంగుటూరు మండలం బాదంపూడి మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం స్థానిక పోస్ట్ ఆఫీసుకు క్షేత్ర పర్యటన నిర్వహించారు.

నాల్గవ తరగతి పరిసరాల విజ్ఞానం పాఠ్యాంశంలో భాగంగా కమ్యూనికేషన్ అంశంపై అవగాహన కల్పించేందుకు నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను ఉపాధ్యాయుడు అల్లు శ్రీను పోస్ట్ ఆఫీసుకు తీసుకువెళ్లారు.
ఈ సందర్భంగా బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ మంగ వెంకట సత్యవతి పోస్ట్ ఆఫీసులో జరిగే వివిధ కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. పోస్టు కార్డు, ఇన్‌ల్యాండ్ లెటర్, ఎన్వలప్ కవరు, సేవింగ్స్ అకౌంట్, పిన్ కోడ్ సంఖ్య ప్రాధాన్యతను అల్లు శ్రీను విద్యార్థులకు వివరించారు.
విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు వెంకట సత్యవతి సహనంతో, స్పష్టంగా సమాధానాలు ఇచ్చారు. క్షేత్ర పర్యటనలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.
ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయుడు అల్లు శ్రీనును పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగాని రామకృష్ణ అభినందించారు.

## బిసిల అట్రాసిటీ ముసాయిదా బిల్లు వారి భవిష్యత్ కు ప్రమాదం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 27:**అనాదిగా దళితులపై జరిగిన కుట్ర నేడు బి సి లపై జరుగుతుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ హెచ్చరించారు .ఏ ప్రాతిప్రదికన బిసి లకు అట్రాసిటీ చట్టం రూపొంది స్తున్నారో చెప్పె ధైర్యం కూటమి సర్కార్ కు వుందని ఆయన ప్రశ్నించారు. బి సి లకు ముసాయిదా బిల్లు అంటే మరో 100 ఏళ్లు అంటరాని వారిగా ముద్ర వేయటం వంటిదన్నారు. బిసి లు కుల దూషణ చట్టం కావాలని బిసి వర్గాలు చంద్రబాబు కూటమిని అడగలే దన్నారు. కాపులను బిసి కేటగిరిలో కలపండని ఎన్నో ఉద్యమాలు చేస్తున్న కాపుల గోడు చంద్రబాబు కూటమికి పట్టటం లేదన్నారు. బి సి లపై చిత్తశుద్ధి వుంటే రాజకీయ , ఆర్థిక రిజర్వేషన్ కల్పించాన్నారు. మనుదర్మం ఆధారంగా అసత్యాలను నేటి దళితులపై - బిసి లపై అనాదిగా రుద్దుతూనే వున్నారన్నారు.
అంబేద్కర్ చేయని కుల ఉద్యమాన్ని ఆ మహానేత ను అడ్డు పెట్టి మెజార్టీ సంపన్న వర్గాలు దళితులు - బిసిల శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. కార్పొరేట్ మీడియా, కార్పొరేట్ రాజకీయ పార్టీలు , కార్పొరేట్ వ్యాపార దిగ్గజాల సుడిగుండంలో నలిగిపోతున్న దళిత, బిసి, మైనారిటీలు మేల్కొవా లన్నారు .కుల ఉద్యమాలు ఉన్నంత వరకు చంద్రబాబు - వై ఎస్ ఆర్ కుటుంబాలకు తిరుగులేదన్నారు.
దళిత - బిసి లది గొప్ప చరిత్ర అయినప్పటికీ కొన్ని తరాలుగా వివక్షతకు గురవుతున్నారన్నారు.
దళితులు - బిసి ల చరిత్ర కోసం చెప్పటానికి పురాతన గ్రంథాల్లో ఉన్న చరిత్ర ను నేడు కనపడనీయరన్నారు. ప్రస్తుతం బిసిల అట్రాసిటీ చట్టం , ముసాయిదా బిల్లు బిసిల భవిష్యత్ ను దోచుకోవటం వంటిదన్నారు. నమ్మకమైన నాయకత్వమే దళిత, బిసి, మైనార్టీ ల భవిష్యత్ కు బంగారు బాటగా నిలుస్తుందన్నారు.
సంపద , పాలన , గత వైభవ చరిత్ర దళిత, బిసి లదని గుర్తించాలన్నారు.
పాలకుల కుట్రలో బిసి లు బలిపశువులుగా మారుతు న్నారన్నారు. ఇప్పటివరకు బీసీ లు వెంకబడిన వారిగా వున్నారని, అట్రాసిటీ ముసాయిదా బిల్లు కారణంగా ఇక నుండి అంటరాని వారిగా వివక్షత కు గురవుతూనే వుంటారన్నారు.అట్రాసిటీ ముసాయిదా బిల్లును కూటమి సర్కార్ బి సి లకు గేలం వేయటమే లక్ష్యంగా రాజ్యాంగ చట్ట బద్దత లేని ముసాయిదా బిల్లుతో బిసి ల భవిష్యత్ పై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బిసి ల భవిష్యత్ పై జరుగుతున్న ఈ కుట్రకు సంబందించి చర్చలకు సిద్దమని మేడా శ్రీనివాస్ బహిరంగ సవాల్ చేసారు.

## శిధిల విద్యుత్ స్తంభాన్ని తొలగించండి





**చింతపల్లి పెన్ పవర్ జనవరి 27** చింతపల్లి పంచాయతీ అంతర్ల గ్రామంలో ప్రమాదకర స్థితికి చేరుకున్న విద్యుత్ స్తంభం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. గ్రామ క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం అడుగు భాగం పూర్తిగా శిధిలమై, ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మైదానంలో ప్రతిరోజూ యువత క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ క్రీడల్లో పాల్గొంటుండగా, శిధిల స్థితిలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రాణాంతక ప్రమాదానికి కారణమయ్యే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. పిల్లలు, యువకులు పెద్ద సంఖ్యలో మైదానంలో ఆడే సమయంలో విద్యుత్ స్తంభం కూలితే భారీ ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికే స్తంభం అడుగు భాగం పూర్తిగా దెబ్బతిని వంగిన స్థితిలో ఉండటంతో వర్షాలు లేదా బలమైన గాలులు వీచిన సమయంలో మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. గతంలోనూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాణ నష్టం జరిగేలోపు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, శిధిల స్థితిలో ఉన్న స్తంభాన్ని వెంటనే తొలగించి, దాని స్థానంలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి ప్రమాదాన్ని నివారించాలని అంతర్ల గ్రామస్తులు కోరుతున్నారు.

## ఇంటర్న్‌షిప్ మరియు పరీక్ష ఫీజుల రిజిస్ట్రేషన్ కు అప్పర్ ఐడీ లు తప్పనిసరి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి



**చింతపల్లి పెన్ పవర్ జనవరి 27 :-**ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతపల్లి లో 2025బి2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన తృతీయ సంవత్సరం బిఏ, బీకాం, బీఎస్సీ ఆరోవ సెమిస్టర్ లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థిని, విద్యార్థులు అపార్ ఐడి మరియు ఏబిసి ఐడీలతో ఇంటర్న్‌షిప్ మరియుపరీక్ష పీజులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కావున విద్యార్థినీ, విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు వచ్చి నమోదుచేసు కోవలసినదిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎం. విజయ భారతితెలియజేశారు. రిజిస్ట్రేషన్ ఈ నెల 29 తేదీ లోగా నమోదు చేసుకోవాలి. లేనియెడల ఆరవ సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ మరియు పరీక్ష ఫీజులకు అనుమతించబడదు.

# పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కేలకం





**జిల్లా పరిశీలకులు, మాజీ శాసన సభ్యులు గురునాథ రెడ్డి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 27**: సిటీ వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మాజీ ఎంపీ మార్గాని భరత్ ఆధ్వర్యంలో కార్యకర్తల విస్తృత సమావేశం మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగింది.

ఈ సమావేశంలో పాల్గొన్న పార్టీ జిల్లా అబ్జర్వర్, మాజీ శాసన సభ్యులు గురునాథ రెడ్డి, జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్, పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, సిటీ పరిశీలకులు అద్దంకి ముక్తేశ్వర రావు, ఆంధ్ర ప్రదేశ్ ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మాజీ రుడా చైర్మన్ , స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిల రెడ్డి, మాజీ స్టేట్ గ్రీనింగ్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, మాజీ సిటీ పరిశీలకులు రావిపాటి రామచంద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం నిరంతరం శ్రమించే కార్యకర్తలకు ప్రమాద బీమా సౌకర్యం ను భరత్ ప్రారంభించారు.

సిటీ పార్టీ నీ బలోపేతం చెయ్యాలి కార్యకర్తలే ముఖ్యం , వారి కోసం నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. సేవ్ రాజమండ్రి కార్యక్రమం ఉధృతం చేస్తామని కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం అవుతామన్నారు.

కష్టపడే ప్రతీ కార్యకర్తకు ప్రమాద బీమా 5 లక్షలు తను స్వంతంగా కడతాను అన్న భరత్, తొలి విడతగా పది మందికి బీమా పత్రాలను అందచేసిన భరత్ తదితర ముఖ్య నాయకులు.

జిల్లా అధ్యక్షులు వేణు మాట్లాడుతూ సంస్థాగత బలం ఉండాలి, వ్యవస్థను నడిపించాలి, జగన్ అనే నాయకుడే బలం మనకు అని రాబోయే కాలంలో మన రాష్ట్రానికి ముఖ్య మంత్రి జగన్ అన్న లక్ష్యంతో పనిచేయాలి.

రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ మాట్లాడుతూ కీలకమైన వ్యక్తులు అంటే కార్యకర్తలే, సామాన్య కార్యకర్తలను నాయకులుగా తయారు చేసిన జగన్, చాలా కష్టాలు బాధలు అనుభవిస్తున్నాము, సిటీ లోని 42 వార్డులు 96 సచివాలయాలు, సచివాలయాలకు సీనియర్ కార్యకర్తలను పరిశీలకులుగా, ప్రతీ రెండు వార్డులకు ఒక పరిశీలాకుడిని నియమించుకుని ఒక్క రాజమండ్రి సిటీ కొరకు సుమారు 6000 మంది జగనన్న సైన్యాన్ని తయారు చేయాలని సూచించారు.డాక్టర్ గూడూరు శ్రీనివాస్, మేడపాటి షర్మిల రెడ్డి, చందన నాగేశ్వర్ మాట్లాడుతూ కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ పటిష్టత కోసం అందరూ సమిష్టిగా కృషిచేయాలని, నగర అభివృద్ధి కోసం భరత్ ఎంత కృషి చేశారో ప్రజలలోకి బలంగా తీసుకునివెళ్ళి 2029 లో జగన్ ను ముఖ్యమంత్రిగా సిటీ కి ఎమ్మెల్యే గా భరత్ ని గెలిపించుకోవాలని కోరారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్లమెంట్ అబ్జర్వర్ మాజీ ఎమ్మెల్యే గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలను కాపడుకుంటే పార్టీ భవిత బాగుంటుందని, భరత్ కు జగన్ తో మంచి సానిహిత్యం ఉందని మంచి రాజకీయ భవిత ఉందన్నారు . వ్యక్తిత్వం ఉన్న మనిషి సిటీ కి ఎమ్మెల్యే గా ఉంటే పార్టీకి, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేస్తారని, త్వరలో కమిటీల నియమించి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు తమ సహాయ సహకారాలు భరత్ కు అందించాలని కోరారు. సిటీ మాజీ అధ్యక్షులు, సీనియర్ పార్టీ నాయకులు నందెపు శ్రీనివాస్ తండ్రి నందెపు వెంకటరావు అకాల మరణానికి చింతిస్తూ ఒక నిముషం మౌనం పాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా, సిటీ వివిధ విభాగాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## వేంకటగిరి కొండ శ్రీ లక్ష్మి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 27:**రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు వేంకటగిరి కొండ పైన కొలువైవున్న శ్రీ శ్రీ శ్రీ లక్ష్మి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి 26 వ కళ్యాణ మహోత్సవ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. టీడీపీ యువ నాయకులు ఆరోగ్య విభగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.గోరంట్ల రవిరామ్ కిరణ్ , టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ , స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణం లో పాల్గొనారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పూజారులు రవిరామ్ కిరణ్ ని శాలువతో సత్కరించి తీర్ధ ప్రసాదాలు అందజేసారు. ఈ సందర్భంగా రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ వెంకట గిరి కొండపై కొలువైవున్న శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం జరిగింది. గత 26 సంవత్సరాలుగా కామిని ప్రసాద్ కుటుంబం పూజలు అందుకుంటు ప్రతీ ఏటా కళ్యాణం స్వామి వారి దివ్య ఆసిస్సులు వారి కుటుంబం పై ప్రజలందరిపై స్వామి వారి కరుణ కటాక్షాలు ఉండలన్నారు . ప్రతి కుటుంబంలోనూ కష్టాలు తీరి సంతోషాలతో, ఉండాలని భగవంతుడిని కోరుకుంటాన్నని రవిరామ్ కిరణ్ తెలియజేసారు.

ఈ వేడుకలో రూరల్ మండల అధ్యక్షులు మత్సేటి శివ ప్రసాద్, గ్రామ అధ్యక్షులు బీమారశెట్టి రమేష్, కామిని భాస్కరరావు,కామిని ప్రసాద్,పలివెల సత్యనారాయణ, పేట లక్ష్మి, పిసిని రమణ,సాంబారి సతీష్ తదితరులు పాల్గొన్నారు

## ఏపీ ఈ ఆర్ సి ట్రూ అప్ చార్జెస్ సమస్యలపై వినతులు స్వీకరణ




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 27:**ఏపీ ఈ ఆర్ సి ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మంగళవారం తూర్పుగోదావరి సర్కిల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ బిల్లులు , ట్రూ అప్ చార్జెస్‌కు సంబంధించిన సమస్యలను న్యాయవాది డి. వెంకటేశ్వరరావు తెలియ చేయడం జరిగిందనీ ఏపీఈపి డీసీఎల్ ఎస్ ఈ కే.తిలక్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రూ అప్ చార్జెస్ అంశంలో అద్దెకు నివసించే వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారని వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. గతంలో అదే ఇంటిలో నివసించిన వినియోగదారులు వినియోగించిన అధిక విద్యుత్ వినియోగం కారణంగా ఏర్పడిన ట్రూ అప్ చార్జెస్ ప్రస్తుతం అద్దెకు నివసిస్తూ తక్కువ విద్యుత్ వినియోగం కలిగిన వినియోగదారులపై భారం పడుతున్నందున అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.

ఈ ట్రూ అప్ చార్జెస్‌ను ఎట్టి పరిస్థితులైనా రద్దు చేయవలసినదిగా ఆయన ఈ ఆర్ సి ను కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ ఈ అంశాన్ని సానుకూలంగా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.

## నేడే నగరంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ పర్యటన

✸ **ఉదయం 10 గంటల నుంచి ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఫిర్యాదుల స్వీకరణ**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 27:**రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ గౌరవ చైర్మన్ కే.ఎస్. జవహర్ జనవరి 28న తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పర్యటించనున్నట్లు ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మంగళవారం తెలిపారు.

ఈ పర్యటనలో భాగంగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన ప్రజల నుంచి స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో అర్జీల స్వీకరణ, అనంతరం కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.చట్టంలోని సెక్షన్12 ప్రకారం గత ఐదు సంవత్సరాలుగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి అమలవుతున్న చట్టపరమైన నిబంధనలు, సంక్షేమ పథకాల అమలు స్థితిగతులపై కమిషన్ సమీక్ష చేయనుంది.

ముఖ్యంగా ఎస్సీ/ఎస్టీ (అట్రాసిటీస్ నివారణ) చట్టం1989, పౌర హక్కుల పరిరక్షణ చట్టం1955 అమలు, ఎస్సీలకు సంబంధించిన భూ సమస్యలు, రిజర్వేషన్ అమలు, పీజీఆర్ఎస్‌లో అందిన ఫిర్యాదుల పరిష్కారం, కమిషన్‌కు ఏటీఆర్‌ల సమర్పణ, జిల్లాడివిజనల్ స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా జనవరి 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు రాజమహేంద్రవరం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నారు. అనంతరం అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కలెక్టర్ కార్యాలయం, బొమ్మూరు లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించ నున్నారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్ఓఆర్, పీజీఆర్ఎస్, బ్యాక్‌లాగ్ ఖాళీలు, వివిధ శాఖల్లో అమలవుతున్న ఎస్సీ సంక్షేమ పథకాల పురోగతి వంటి అంశాలపై చర్చ జరగనుందని మేఘా స్వరూప్ తెలిపారు.

ఈ సమావేశానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టి, సంబంధిత రికార్డులు, గణాంకాలతో జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ ఆదేశించారు.

## తల్లిదండ్రుల విశ్వాసమే భాష్యం ఎదుగుదలకు దోహదం చేసింది

✸ **భాష్యం చైర్మన్ భాష్యం రామకృష్ణ**




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 27**

భాష్యం విద్య సంస్థ శాఖోప శాఖలుగా విస్తరించి ఎదగడానికి కారకులైన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేసు కుంటున్నానని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. స్థానిక జె.కె.గార్డెన్స్ లో భాష్యం 25 విద్యా వసంతాల రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక దానవాయిపేట లో భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్ ని స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2001-02 విద్యా సంవత్సరం మొదటి బ్యాచ్ విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో భాష్యం విద్యాసంస్థలను స్థాపించి 25 వసంతాలను పూర్తి చేసుకుని రజతోత్సవ వేడుకలను జరుపుకోవడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. తల్లిదండ్రుల ఆధారాభిమానాలతో

భాష్యం విద్యాసంస్థలు ఉభయ గోదావరి జిల్లాల్లో వేగంగా విస్తరించాయన్నారు. భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు మాట్లాడుతూ, తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు శ్రమకోర్చి దానవాయిపేటలో మొదటి బ్రాంచ్ ని ప్రారంభించమన్నారు. తమకు వెన్నుదన్నుగా నిలిచిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు, అకడమిక్ కోర్ టీం కి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా మొదటి బ్యాచ్ విద్యార్థుల తల్లిదండ్రులైన 126 మందిని భాష్యం రామకృష్ణ, భాష్యం హను మంతరావులు దుశాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావులను ఈస్ట్ 1, 2, 3, వెస్ట్ జోన్ల జెడ్ ఈ వో లు, ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. సభకు భాష్యం విద్యాసంస్థల ముఖ్య సలహాదారు మైఖేల్ రాజ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల జెడ్ ఈ ఓ లు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు తాడేపల్లిగూడెం నియోజకవర్గ స్థాయి వైసీపీ సమావేశం.

**వైస్సార్సీపీ కోఆర్డినేటర్ వడ్డె రఘురాం.**



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 27.**మన తాడేపల్లిగూడెం మాగంటి కల్యాణ మండపం బుధవారం జరగబోయే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశానికి విచ్చేస్తున్న నాయకులు మరియు కార్యకర్తలకి అభిమానులకి నా యొక్క ముఖ్య విన్నపం..

రేపు వివిధ గ్రామాల నుండి వచ్చే వారందరికీ నా యొక్క విన్నపం.

మీరు వచ్చే వారందరూ కూడా బైకుల మీద కార్ల మీద ఆటోల మీద వచ్చే వారందరూ కూడా చాలా జాగ్రత్తగా రావాలని నా యొక్క విన్నపం నీ ప్రేమ అనురాగాలు ఎల్లప్పుడూ నా గుండెల్లోనే ఉంటాయని ఆశిస్తున్నాను. మనందరికీ కూడా ఇంటి వద్ద ఫ్యామిలీస్ ఉన్నాయని మర్చిపోకండి.

మీరు వచ్చేటప్పుడు వెళ్లేటప్పుడు చాలా జాగ్రత్తగా వచ్చి మరలా ఇంటి కూడా జాగ్రత్తగా చేరాలని కోరుకుంటున్నాను..

నీ ప్రేమ అనురాగాలు ఎప్పుడూ నా గుండెల్లో చిరస్థాయిగా ఉంటాయని అని అన్నారు.

## ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అధికారుల అవార్డ్ గ్రహీతలకు అభినందనలు.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 27.**77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీమతి ఈ స్వరాజ్యలక్ష్మి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కి మరియు జి.మురళి మోహన రావు ఎక్సైజ్ ఎస్సై లు అవార్డ్ లకు ఎంపిక కాబడి ఎక్సైజ్ కమిషనర్ సి హెచ్ శ్రీధర్ మరియు ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్, ఎక్సైజ్ రాహుల్ దేవ్ శర్మ వారి చేతుల మీదుగా మంగళగిరి లో గల ఎక్సైజ్ కమిషనర్ ఆఫీసు లో అవార్డ్ లను స్వీకరించటం జరిగింది.

ఈ సందర్భంగా స్థానిక వైన్ షాపుల యజమానులు, అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అవార్డ్ లు పొందిన సిఐ స్వరాజ్య లక్ష్మి , మురళి నీ అభినందించారు.

స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది తమ స్టేషన్ పరిధి లో ఇద్దరు అధికారులకు రాష్ట్ర స్థాయి అవార్డ్ రావటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళల కోసం డిజిటల్ నైపుణ్యాల సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం





**చింతూరు, పెన్ పవర్ జనవరి 27:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో బ్లాక్ బక్స్ విద్యాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మహిళల కోసం డిజిటల్ నైపుణ్యాలపై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. రత్న మాణిక్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న జె. హేమంత్ కుమార్ కంప్యూటర్ ఆధారిత సేవలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ నేటి కాలంలో డిజిటల్ సేవలపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని అన్నారు.

కోర్సు సమన్వయకర్త జి. వెంకట్రావు మాట్లాడుతూ మహిళ సాధికారత సాధించడంలో డిజిటల్ విద్య ఎంతో దోహదపడుతుందన్నారు. ఉప ప్రిన్సిపల్ ఎం. శేఖర్ ఆధునిక సాంకేతిక విద్యను అవలంబించడం తప్పనిసరిగా మారిందని పేర్కొన్నారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె. శకుంతల మాట్లాడుతూ కంప్యూటర్ నైపుణ్యాలు కలిగిన విద్యార్థులకు భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com